12/6

Futures

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జూన్ 11, 2006



చదువుల బరువులు షురూ...!

హ్యాపీ బర్త్ డే

(11.6.2006 నుంచి
17.6.2006 వరకు)

వి. దినేష్ (చింటు)
2సం॥, జూన్-12
సత్యవతి-వెంకట్రావు
గోవిందాపురం-ఖమ్మం

కె. జగదీష్‌బాబు
4సం॥, జూన్-12
విజయలక్ష్మి-శ్రీను
మచిలీపట్నం-కృష్ణా

ఎస్. శ్రీకాంత్
5సం॥, జూన్-13
మంజుల-మల్లేష్
పటాన్‌చెరు-మెదక్

కార్తీకేయన్
7సం॥, జూన్-15
లక్ష్మీప్రసన్న-నరసింహం
విశాఖపట్నం

వి. రవీనా
2సం॥, జూన్-2004
భవాని-మల్లికార్జున్
ఉండవల్లి-కృష్ణా

హృదయ్
1సం॥, జూన్-2005
హరిప్రియ-అరవింద్
సికింద్రాబాద్

చదవడం అలవాటు చేసుకోవాలి...

మన అతిథి గురించి...

పేరు	:	పోల్కంపల్లి శాంతాదేవి
పుట్టింది, ఊరు	:	1942, శ్రీరంగాపురం (వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా)
విద్య, వృత్తి	:	మెట్రిక్యులేషన్, రచయిత్రి
నచ్చిన వ్యక్తులు	:	శరత్‌చంద్ర, యద్దనపూడి సులోచనారాణి
నచ్చని అంశం	:	పబ్లిసిటీ
బలం	:	ఆత్మవిశ్వాసం
బలహీనత	:	స్టేజ్‌ఫియర్
మధురానుభూతి	:	'ప్రేమికారాణి', 'తామరపూలు' నవలలు చదివి ప్రముఖ రచయిత వేదుల సూర్యనారాయణ శర్మ బాగుందని ఉత్తరం రాయడం.
రచనలు	:	చండీప్రియ, పుష్యమి, జీవన సంగీతం, ప్రేమబంధం నవలలు
అవార్డులు	:	తెలుగు యూనివర్శిటీ 'ధర్మ నిధి' అవార్డు

మన సమాజం మారాలనుకున్నంతగా మారలేదు. మారాల్సింది చాలా ఉంది. స్త్రీలకు టీవీ పిచ్చి పట్టింది. చెత్త సీరియల్స్ చూస్తూ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. టీవీ కన్నా పుస్తక పఠనం మంచిది. దీన్ని పెంచుకోవాలి. మనసు పొరలను తట్టేశక్తి పుస్తకాలకు మాత్రమే ఉంది. నేటి యువత తాము చేయాలనుకున్నదే చేస్తున్నారు. అమ్మ, నాన్న, సమాజం అంటే భయం లేదు. నాటి రచయితలు విలువలకోసం పాటుపడేవారు. అందుకే అప్పటి రచనలు సందేశాత్మకంగా, ఆదర్శంగా ఉండేవి. నేడివన్నీ లోపించి రచనలు కేవలం టైమ్‌పాస్‌కి అన్నట్లుంటున్నాయి.

పోల్కంపల్లి శాంతాదేవి

ఈ సంచికలో.. ఇంకా...

టపా ... 2
టర్నింగ్ పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కామన్ సెన్సు ... 20



కథ 18
తేడా

ఇలా వుందామా... 7
ప్రమాదం



సీరియల్ 8
తెలుగుగడ్డ



ఆరోగ్యం ... 17
ఓ మంచి పుస్తకం ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞాన వీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

డావిన్సికోడ్

కవర్‌స్టోరీగా వివాదాస్పద 'డావిన్సికోడ్' చిత్ర సమాచారాన్ని ఇచ్చిన తీరు బాగుంది. ఏదోవిధంగా పబ్లిసిటీ చేయించుకుని కాసులు దండుకునే హాలీవుడ్‌వైఖరి గురించి చక్కగా చెప్పారు. నేటి సినిమాల్లో పసలేకున్నా ఏదోవిధంగా హంగామా సృష్టించి అందరి దృష్టిలో పడేలాచేసి విజయం సాధించాలనుకునే హాలీవుడ్ చిత్రసీమగురించి చక్కగా వివరించారు. కథలూ, కార్టూన్లూ బాగుంటున్నాయి. వీలైతే కార్టూన్లు, జోకులకు ప్రత్యేక పేజీ కేటాయిస్తే బాగుంటుంది.

శ్యామ్‌సుందర్, చిలకుర్తి, నల్గొండ జిల్లా.

కార్టూన్లు బాగున్నాయి

కందుకూరి స్మృత్యర్థం మూఢనమ్మకాలపై ప్రచురించిన ప్రత్యేకపేజీలోని కార్టూన్లు చాలా బాగున్నాయి. లోపలిపేజీలో వచ్చిన కార్టూన్లు మరింతగా ఆకట్టుకున్నాయి. బయటికెళ్ళేప్పుటు పిల్లెదురైతే అపశకునంగా భావించే మనగురించి పిల్లులేమనుకుంటాయో చెప్పినతీరు మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. పాములగురించి వేసిన కార్టూన్‌కూడా చాలాబాగుంది. కార్టూన్లకోసం ప్రతివారమూ ఇలా ఓ ప్రత్యేకపేజీ కేటాయిస్తే బాగుంటుంది.

పిడుగు సూర్యారావు, త్రివేణి,
పొందూరు, శ్రీకాకుళం.

కామన్‌సెన్సు...

కామన్‌సెన్సు లేకుండా ఎవరేం చెప్పినా నమ్మి ఆచరించే మనుషుల గురించి, అవి మోసాలేనని 'మందు మార్పించే మందు' కథనంలో బాగా చెప్పారు. అలవాట్లనేవి మనం చేసుకున్నవే... వాటిని కొనసాగించడం, మానేయడం మన చేతుల్లోనే ఉంటుంది... ఎవరో కషాయాలు... రక్షలు ఇవ్వడం ద్వారా ఆ అలవాటు పోతుందని భావించడం ఎంత అవివేకమో చక్కగా చెప్పారు. కథలు బాగున్నాయి. కార్టూన్లూ, కవర్‌స్టోరీకూడా బాగున్నాయి.

మధుబాబు, ఏలూరు,
ప.గో.జిల్లా.

నూతనోత్సాహం

మన అతిథి శీర్షికలో చిర్రావూరి లక్ష్మీనర్సయ్య గారి సూచనలు ఓటమిపాలైన వారికి నూతనోత్సాహాన్నిచ్చే విధంగా ఉన్నాయి. ఇబ్బందులు, ఆటంకాలు సహజమేనని, అవి అందరికీ ఉంటాయని, వాటినధిగమించి విజయం సాధించాలని ఆయన చెప్పిన తీరు బాగుంది. కథ బాగుంది. న్యాయసలహాలు ఉపయోగకరంగా వున్నాయి.

వరలక్ష్మి, కరీంనగర్.

జాగ్రత్తలు

మనసా... తెలుసా... శీర్షికలో పిల్లలగురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు బాగా రాశారు. అది చదివే వరకూ పిల్లలగుంరించి అంతా తెలుసనుకునే మాకు కొన్ని కొత్త విషయాలు తెలిసొచ్చాయి. కార్టూన్లు బాగున్నాయి. ఇలాఉందామా... శీర్షికలో నగరజీవితం గురించి చెప్పిన తీరు కళ్లకు కట్టినట్టుంది. అది చదివాక కొద్దిగా కళ్లు చెమ్మగిల్లాయి.

రుక్మిణి,
తాటిచెట్లపాలెం,
వైజాగ్.

బాధాకరం

'ఓ అమ్మకథ' చాలా బాగుంది. తల్లికి తెలియకుండా కొడుకు ఆమెను వృద్ధాశ్రమంలో చేర్పించడం చాలా బాధ కలిగించింది. జన్మనిచ్చిన తల్లిని చివరిదశలో సంతోషపెట్టాల్సిందిపోయి, ఇలా చేయడం వల్ల తల్లిమనసు ఎంత బాధపడిందో...! కార్టూన్లు బాగున్నాయి. రుచి శీర్షికలోని కొత్త వంటకాలు బాగున్నాయి. చేసుకుని తింటున్నాం.

డి. వాహిని, కొత్తగూడెం.

స్ఫూర్తిదాయకం

ఆరోగ్యంపేజీ ద్వారా అకాలంగా బ్రెయిన్‌డెత్ చెందినవారి అవయవదానం గురించి పాఠకులకు పరిచయం చేయడం స్ఫూర్తిదాయకంగా ఉంది. వారు తమ అవయవాల ద్వారా ప్రపంచాన్ని మళ్లీ చూస్తూ చిరంజీవులడం అనేది నిజంగా ప్రశంసనీయం.

వసంతలక్ష్మి, నెల్లూరు.

ఆలోచింపజేసింది

'విజ్ఞాన వీచిక' శీర్షికలో నగరాలకూ, పల్లెలకూ మధ్య ఉన్న అంతరాలు గురించి చెప్పడం మమ్మల్నెంతగానో ఆలోచింపజేసింది. రోగాలపాల్జేసే కూల్‌డ్రింక్ కంపెనీలైతే ప్రతి గ్రామాన్నీ చేరాయిగానీ, అనారోగ్యమొస్తే నయంచేసే డాక్టర్లుమాత్రం అందుబాటులో లేరనే విషయం అక్షరసత్యం.

వై. నాగేశ్వరరావు, అనంతపురం.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

రూ.150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈ కోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3728

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

డార్విన్ పరిణామసిద్ధాంతం



పందొమ్మిది, ఇరవై శతాబ్దాల్లో శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం పెంపొంది ప్రపంచచరిత్ర గమనాన్నే మార్చివేశాయి. పారిశ్రామిక విప్లవం తెచ్చిన పెనుమార్పుల గూర్చి ఇంతకుముందు తెలుసుకున్నాం. ముఖ్యంగా ఈ నూతన శాస్త్ర ఆవిష్కరణలు ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల్లో జరిగి కర్మాగారాలు విపరీతంగా పెరిగి, రవాణా సౌకర్యాలు వృద్ధిచెంది, వస్త్రోత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి, ఆవిరి ఓడలు - ఇంకా ఎన్నో కొత్త పరిశోధనలు ప్రపంచాన్ని కుదిపేశాయి. దేశాలమధ్య సరిహద్దులు చెరిగిపోకున్నా, దేశాలమధ్య దూరం తగ్గి రాకపోకలు పెరిగాయి. ఈ మార్పులవల్ల ఇంగ్లండ్ మరింతగా లాభపడింది. వలస విధానం పాటించి ఆయా దేశాలనుండి సహజవనరులు, సంపద వచ్చిపడి ఇంగ్లండ్ సంపన్నమైంది. వ్యవసాయ సమాజంగా ఉన్న ఇంగ్లండ్ పారిశ్రామిక సమాజంగా రూపుదిద్దుకుంది. కొత్తగా ఏర్పడ్డ పారిశ్రామిక సమాజంలో ఆర్థిక అంశాల ప్రాధాన్యత పెరుగుతూవచ్చి, మతపరమైన ఆలోచనలు తగ్గుముఖం పట్టి, ప్రజలజీవితాల్లో మతం పట్టు క్రమేపీ సడలడం ఆరంభమైంది.

ఈ నేపథ్యంలో 1859లో ఒక గ్రంథం వెలువడింది. దాని పేరు 'ఆరిజన్ ఆఫ్ స్పైసెస్'. గ్రంథకర్త చార్లెస్ డార్విన్. ఈ 'జీవరాశుల పుట్టుక' శాస్త్రవిజ్ఞానంలోనే కాక, మత సామాజికపరంగా కూడా విప్లవాత్మక మార్పులకు దోహదం చేసింది. ఈ గ్రంథ ప్రచురణతో మతవ్యవస్థపై పిడుగు పడ్డట్టయింది. మతానికీ, శాస్త్రానికీ మధ్య జరుగుతున్న పోరాటం తారాస్థాయికి చేరింది.

ఇంతకీ డార్విన్ ప్రవచించిన జీవపరిణామ సిద్ధాంతం ఏం చెప్పింది? చార్లెస్ డార్విన్ వస్తుతా ప్రకృతి శాస్త్రవేత్త. వైద్యశాస్త్రంలో ఆరితేరినా, ప్రకృతి శాస్త్రవేత్తగానే వృత్తిచేపట్టాడు. ప్రకృతికి సంబంధించి, అందులోని అసంఖ్యాక జీవరాశుల గూర్చి కూపీలు తీశాడు. కొత్త ఆలోచనల క్రమం జీవపరిణామసిద్ధాంతానికి దారితీసింది. జీవులు గుణోత్తరం(జామెట్రిక్)గా వృద్ధిచెందుతాయి. అందులో కొన్ని యథాతథంగా ఉండిపోయినా, మరికొన్ని వేగంగా రూపాంతరం చెంది మారుతూ ముందుకుపోతాయి. దీన్ని డార్విన్ 'సర్వైవల్ ఆఫ్ లైఫ్' సిద్ధాంతంగా మలిచాడు. దీన్నే మరోరకంగా చెప్పాలంటే, మనం నివసించే ఈ భూమిపుట్టి దాదాపు 450 కోట్ల సంవత్సరాలని శాస్త్రజ్ఞుల అంచనా. ఈ భూమిపై జీవం పుట్టడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. ఏకకణజీవి(అమీబా) నుండి బహుకణజీవి, జలచరాలు, భూమ్మీద, నీటిమీద కూడా తిరిగే ఉభయచరాలు, భూచరాలు, జంతుజాలం, వానరం ఇలా అనేక దశలు దాటాక, మనిషి అవతరించాడు. దీన్ని డార్విన్ 'మానవ సంతతి'(ద డిసెంట్ ఆఫ్ మ్యాన్)గా వర్ణించాడు.

డార్విన్ పరిణామసిద్ధాంతం ద్వారా దైవసృష్టి సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. తద్వారా దేవుని ఉనికినే ప్రశ్నించినట్లయింది. పరిణామక్రమంలో పుట్టుకొచ్చిన మనిషి జీవులను సృష్టించడంవల్ల దేవుని పాత్ర ఏముందనే ప్రశ్న తలెత్తింది. దీంతో మతగురువులు డార్విన్‌పై విరుచుకుపడ్డారు. మతం హేతుబద్ధమైన, స్వతంత్రమైన ఆలోచనలను ప్రోత్సహించదు. గుడ్డివిశ్వాసాలను ప్రజలపై రుద్ది, మూఢాచారాలను, సాంఘిక దురాచారాలను ప్రోత్సహిస్తుంది. కానీ సైన్స్ మతానికి భిన్నం. ఇది యథార్థాలపైనా, వాస్తవాలపైనా ఆధారపడుతుంది. ప్రయోగం దాని పద్ధతి. ప్రయోగం ద్వారా నిగ్గుతేల్చి నిజాన్ని చెబుతుంది సైన్స్. మనిషిలో ఆలోచనలను రేకెత్తించి, ప్రశ్నించేతత్వాన్ని పెంపొందిస్తుంది. సృష్టి ఆవిర్భవించింది మొదలు నేటివరకూ మానవుడు సాధించిన ప్రగతి మొత్తం శాస్త్రవిజ్ఞానం ద్వారానే సాధ్యమైందన్న వాస్తవాన్ని మతం అంగీకరించకపోవడమే మతంలోని మౌఢ్యం.

డార్విన్ సిద్ధాంతాన్ని ఆ తర్వాతికాలంలో సామ్రాజ్యవాదులు సోషల్‌డార్వినిజంగా మార్పుచేసి వలసలపై తమ ఆధిపత్యాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు కుట్రపన్నారు. సామ్రాజ్యవాద దేశాల్లోని సామాజిక శాస్త్రవేత్తలు డార్వినిజాన్ని 'సర్వైవల్ ఆఫ్ ఫిటెస్ట్' అనే బలమున్నవాడే బతికి బట్టకడతాడనీ, జాతిపరంగా తెల్లజాతివారు ప్రపంచంలోని ఇతర జాతులకంటే తెలివితేటలు, శక్తిసామర్థ్యాల్లో ఉన్నతులన్న జాతివివక్ష సిద్ధాంతాన్ని లేవదీశారు. దీని ప్రకారం సమర్థులైన తెల్లజాతివారికే ఇతర జాతులను పరిపాలించే అధికారం ఉందన్న వితండవాదనను ముందుకుతెచ్చారు. ఈ అమానవీయ రాజ్యాధికార సిద్ధాంతాన్ని ఆంగ్లపాలకులు భారతదేశంలో తమపెత్తనాన్ని సమర్థించుకోవటానికి ఉపయోగించుకున్నారు.

మనిషి పుట్టుకను శాస్త్రీయంగా పరిశోధించి దైవదృష్టిని తిరస్కరించిన డార్విన్‌సిద్ధాంతం మానవుల సామాజిక దృక్పథాన్ని మార్చినంతగా మరే ఇతర శాస్త్రగ్రంథమూ చేయలేదు.

అధికార్లు చెపుతున్నారు.

క్రియపురోణి కాలపరిమితి ఎంతకాలం వుంటుంది ? కొందరు పెద్దవాళ్ళు 3సం॥ములతో కాలపరిమితి ముగిసిపోతుందని అంటూవుంటారు. మా గ్రామంలో పైమాషి నెంబర్‌పై ముందు క్రయ విక్రయాలు జరిపి రిజిస్ట్రేషన్ చేసేవారు. 3సం॥రముల క్రితం రెవెన్యూ శాఖ వారు సర్వే నిర్వహించి 2సం॥రముల క్రితం పట్టాలు మంజూరుచేసి సర్వే నెంబర్లు కూడ యిచ్చియున్నారు. పట్టాదారు పాసు పుస్తకములు ఇచ్చేవరకు అమ్మకం, కొనుగోలును నిషేధించుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎందుకు అలా జరిగిందంటే అమ్మకం, కొనుగోలు జరిగినట్లయితే రికార్డు తయారికి కష్టం అవుతుందని అధికార్లు చెపుతున్నారు. నేటి వరకు పట్టాదారు పాసుపుస్తకములు ఇవ్వలేదు. రైతులు తమ అవసరాల నిమిత్తం భూమి రేట్లు నిర్ణయించుకొని క్రయ విక్రయాలు జరిపి క్రియపురోణిలు రాసుకుంటూ కొలతలు కూడా జరిపి భూమిని అమ్మినవారికి అప్పగిస్తున్నారు. ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవాలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే అప్పుడు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వారి ఎదుట రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వగలను అని రాస్తున్నారు. మేం క్రియపురోణి రాసుకొని ఇప్పటికి 2సం॥లు గడిచింది. ప్రభుత్వం ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఉత్తర్వులు ఇవ్వలేదు. 3సం॥లు దాటినట్లయితే క్రియపురోణి చెల్లదంటున్నారు. పై రాతలు గ్రామ సాక్షుల సమక్షంలో రాసుకొనియున్నాం. గురించి ఏం చెయ్యాలి? తగు సూచనలు, సలహాలు క్లుప్తంగా తెలుపగలరని ప్రార్థిస్తున్నాను.

బి.వి.రమణ

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

లిమిటేషన్ చట్టప్రకారం కాల పరిమితి ఏ విధమయినటువంటి సేల్ అగ్రిమెంట్ ఉన్నా మూడు సంవత్సరాల లోపు అతడు రిజిస్ట్రేషన్ చేయాలి. అలా మూడు సంవత్సరాలు దాటిన అగ్రిమెంట్ ఆఫ్ సేల్ తదుపరి చెల్లనేరదు.

మీ విషయంలో ప్రభుత్వంవారు జారీ చేసిన నిషేధపు ఉత్తర్వులతో రెండు సంవత్సరాలు అయినా నిషేదం ఉపసంహరించుకోలేదు. కావున మీరు కలెక్టర్ గారికి, ఆర్‌డిఓ గారికి దరఖాస్తు పెట్టుకుని మూడు సంవత్సరాలు దాటిపోతే పట్టాదారులు రిజిస్ట్రేషన్ చేయనంటే వచ్చే పరిణామాలు వివరించండి వారు ప్రతి స్పందించి నిషేధ ఉత్తర్వులు వాపసు తీసుకుంటే సరి. లేదా హై కోర్టులో రిట్‌పిటిషన్ వేసి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తోంది. కావున మీరిచ్చిన దరఖాస్తుతో సహా నిషేధం తొలగించేటట్లు ఉత్తర్వులు పొందవచ్చును.

మీ అగ్రిమెంట్ చెల్లుబడయ్యేట్లు చూసుకోవాలంటూ మూడు సంవత్సరాలలోపు లీగల్ నోటీసు ఇచ్చి స్పెసిఫిక్ పర్‌ఫార్మేన్స్ దావా వేసి ఉంచినట్లయితే ప్రభుత్వంవారు ఉత్తర్వులు వచ్చే వరకు ఇంకొంత సమయంలో సంవత్సరం దావా ద్వారా పొందవచ్చును.



ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

పెద్ద కుక్క – బుల్లి కుక్క

కొంతమందికి కుక్కలంటే భలే ఇష్టం. ఇంకొందరికి చచ్చేంత భయం కూడానూ.

ఇష్టమున్నవారు వాటిని ముద్దాడుతూ గారం చెయ్యడం చూసేవాళ్లకు కాస్తంత విసుగు, ఆశ్చర్యం కలిగించేలా ఉంటాయి. అలాగే కుక్కంటే భయమున్నవాళ్లు దాన్ని చూడగానే తడబాటుచెందడం, కంగారుపడి పరుగెత్తడం చూస్తే ముందు నవ్వొస్తుంది. తరువాత జాలేస్తుంది. వారివారి మనస్తత్వాన్నిబట్టి వారి ప్రవర్తన వుంటుంది. చూసేవాళ్లకెలావున్నా ఎవరి బాధ, ఆనందం వారివే.

ఆ అపార్టుమెంటులో ముప్ఫైఆరు ఫ్లాట్లున్నాయి. సుమారు సగంమంది ఓనర్లే వాటిల్లో ఉంటున్నారు. కొంతమంది మరెక్కడో ఉండి ఇక్కడి ఫ్లాట్ అద్దెకిచ్చుకున్నారు. అందరికీ కాకపోయినా సుమారు పన్నెండు, పదమూడు ఫ్లాట్లవారికి పెంపుడుకుక్కలున్నాయి. ముగ్గురికో, నలుగురికో మామూలు కుక్కపిల్లలున్నా మిగిలినవారివి పెద్దపెద్ద భయంకరమైన జాతికుక్కలు. ఆల్సేషియన్లు, డాబర్‌మన్లు, బుల్‌డాగ్‌లు, డాల్‌మేషియన్లు ఇలా మనిషి కనిపిస్తే మీదపడి కరిచే కావలాకుక్కలవి. చిన్నచిన్న బొచ్చుకుక్కలయితే పీలగొంతులతో హడావుడే చేస్తాయిగానీ ఎవర్నీ ఏమీ చెయ్యవు. ఎదుటివాళ్లు పలకరిస్తే తోకాడిస్తూ స్నేహం నెరిపేస్తాయి. చాలామంది ఈ బుజ్జి కుక్కపిల్లల్ని ఎత్తుకుని తీసుకెళ్లి వాటి అవసరాలు తీరేలా కొంతసేపు వీధిలో తిప్పి మళ్లీ అపురూపంగా ఇంటికి తీసుకొచ్చుకుంటారు.

ఘోష్‌గారి కుక్క ఆల్సేషియన్. దాన్ని చూస్తేనే గుండె దడేల్‌మంటుంది. వాళ్లమ్మాయి దాన్ని జాగ్రత్తగా బయటికి తీసుకెళ్లి, తీసుకొస్తుంది. ఆయన మిలట్రీ ఆఫీసరు. ఉద్యోగరీత్యా ఎక్కడో ఉంటాడు. ఇక్కడ భార్యాపిల్లలుంటారు. వాళ్లున్న ఫ్లోర్‌లో లిఫ్టు ఆగగానే అది మొరుగుతుంది. దాంతో లిఫ్టులో ఉన్నవారి గుండెలు కడుపులోకి జారిపోతాయి. పనిలేకుండా అయితే వాళ్లింటివైపు చూడటానికి కూడా ఎవరూ సాహసించరు.

లలితగారి కుక్క ఆమెలాగే నాజూకుగా, లలితంగా, ముద్దుగా, చిన్నగా ఉంటుంది. ఆమె సరదాగా కాలక్షేపంకోసం పెంచుకునే తెల్లని బొచ్చుకుక్కది.

ఆరోజు ఘోష్‌గారమ్మాయి కొంచెం ఏమరుపాటుగా వుండటం, లలితగారి కుక్క ఆమె చంకలో కూర్చుని విపరీతంగా మొరిగి అల్లరి చేయడంతో ఆ ఆల్సేషియన్ ఈ బుజ్జికుక్కను పట్టికొరికి వదిలిపెట్టింది. ఆ సమయంలో కేకలు, బొబ్బలతో అపార్టుమెంటంతా దద్దరిల్లింది. మొత్తానికి ఘోష్‌గారమ్మాయి కంట్రోల్‌చేసి దాన్ని ఇంట్లోకి తీసుకుపోయింది. లలిత కూడా చంకలోవున్న కుక్కపిల్ల కిందికి దూకేస్తుంటే పట్టుకోలేకపోవడంతో ఘోరం జరిగిపోయింది. రక్తం కారిపోతోంటే దాన్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. దానికి పధ్నాలుగు కుట్లుపడ్డాయి. భయంతో ఆ కుక్కపిల్ల కళ్లు పీక్కుపోయి, చీమచిటుక్కుమన్నా వులిక్కిపడటం మొదలెట్టింది. లలిత కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ ఘోష్‌గారింటికెళ్లి కటువుగా మాట్లాడింది. మిసెస్ ఘోష్ ఎంతో మర్యాదగా సమాధానంచెప్పి చివరికి "ఒక్కోసారి ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయి మనమే జాగ్రత్తగా వుండాలి" అని సమర్థించుకుంది.

"మీది ప్రమాదకరమైన కుక్క, ఇంత అజాగ్రత్తగా ఉంటే ఎలా?" అంటూ నిలదీసింది లలిత.

"మేమూ ఇక్కడ మూడేళ్ళనుంచీ ఉంటున్నాం. ఇలా ఎప్పుడూ జరగలేదు కదా..." అని సమాధానంచెప్పి "కొన్ని మనం ఊహించలేని సంఘటనలు జరుగుతుంటాయి, ఏం చేస్తాం?!" అని జోడించింది.

కొంతసేపిలా వాదన జరిగాక కుక్కలున్నవారంతా ఒకవైపు చేరారు. కుక్కల్లేనివాళ్లు ఒకటిగా ఉండకుండా చీలిపోయారు. కుక్కలంటే ఇష్టముండి వీలులేనికొందరు ఎప్పుడైనా ఓ కుక్కపిల్లను తెచ్చుకుందామనే ఉద్దేశంతో కుక్కలున్నవాళ్లవైపు మాట్లాడారు. కుక్కలంటే భయపడేవాళ్లు "ఈ కుక్కల గోలేంటి..." అంటూ గేలి చేశారు.

అయితే అద్దెకున్నవాళ్లమాట చెల్లకపోవడంవల్ల ఓనర్లు చాలామంది కుక్కని పెంచుకుంటే తప్పులేదని తేల్చారు.

మొత్తానికి 'కుక్కలువద్దు' అన్నవారి మాట నెగ్గలేదు. అందరూ తమబుర్రలకు పదునుపెట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్టికను తయారుచేశారు. అందులో పెద్దకుక్కలవాళ్లేం చెయ్యాలి? చిన్న కుక్కలవాళ్లేం చెయ్యాలి? అని ఒక ఇరవై పాయింట్స్‌తో పెద్ద నర్క్యులర్ తయారుచేశారు.

మొత్తంగా చూస్తే అందరికీ ఏమంత సంతృప్తికరంగా అనిపించకపోయినా అంతకంటే చేసేదేంలేక ఊరుకున్నారు.

లలితగారి కుక్కపిల్ల పదిహేనురోజులు గడిచాక కాస్త మామూలు స్థితికి వచ్చింది.

ఆరోజు పెద్ద వర్షం పడి, ఊరంతా కరెంటుపోయి చిమ్మచీకటైపోయింది.

రాత్రంతా చీకట్లో అపార్టుమెంటులో అందరూ బిక్కుబిక్కుమంటూ కొవ్వొత్తులతో కాలక్షేపం చేస్తోంటే తెల్లారుజామున మూడుగంటలకి ఎవరో గోడదూకి కాంపౌండులోకొచ్చినట్లు అలికిడై, పీలగా, సన్నగా వున్న కీచుగొంతుతో లలితావాళ్ళ కుక్క అరగంటసేపు ఆగకుండా మొరిగింది.

'ఏమిటీగోల...?' అని టార్చిలైట్లు వేసుకుని పరిగెడితే... చీకట్లో మళ్లీ గోడదూకి పారిపోతోన్న మానవాకారం కనిపించింది.

'కుక్కలుండటం మంచిదే...' అన్నారంతా.

"చిన్నదైతేనేం, మా కుక్క కూడా గొంతుపోయేలా అరిచింది" అంటూ లలిత తన కుక్కని ముద్దుచేసింది.

ఘోష్‌గారి భార్య ధైర్యంగా కుక్కని పక్కనపెట్టుకుని బయటికొచ్చి, నాలుగువైపులా పరికించి చూసి, నలుగురితో మాట్లాడి... మరేం భయంలేదని చెప్పి లోపలికెళ్లి తలుపేసుకుంది.

లలితగారి బుల్లి కుక్క, ఘోష్‌గారి పెద్దకుక్క తమ కర్తవ్యం తాము సరిగ్గా చేశామనే తృప్తితో హాయిగా ముదుచుకుని పడుకున్నాయి.



ఇలా వుందామా...

వి. నాగరత్న

ప్రమాదం

కీర్తన పదో తరగతికి వచ్చింది. కొంతకాలంగా ఆ అమ్మాయి ఏదో పోగొట్టుకున్నట్లు ముభావంగా వుంటోంది. చీటికిమాటికి ఏదో అనారోగ్యమూ చోటుచేసుకుంటోంది.

తాజాగా తల్నొప్పితో బాధపడ్తోంది. అంతకుముందురోజు మొదలైన తల్నొప్పి నాలుగు పెయిన్‌కిల్లర్లు వేసుకున్నా తగ్గకపోవడంతో తల్లి బలవంతంచేసి జనరల్ ఫిజీషియన్ దగ్గరికి తీసికెళ్ళింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాయడం పూర్తయ్యాక



"పాపకి జనరల్ చెకప్ ఏమైనా చేయించమంటారా? నోటిపూతని, వామిటింగ్ సెన్సేషన్ అని - తరచూ ఏదోఒకటి వస్తోంది" అంది కావేరి.

"ఇప్పుడేమీ అక్కర్లేదు, ఈ కోర్సయ్యాక చూద్దాం" అన్నాడాయన.

"అది కాదండీ, ఇప్పుడు టెంత్‌క్లాస్‌కి వచ్చింది.. ఈ వరసన మూలపడ్తోంటే ఇంకేం చదువుతుంది? ఈ సంవత్సరం అసలే శ్రద్ధగా చదవాలిగదా.." అంది.

ఆ డాక్టర్ మరీ కమర్షియల్ తరహా కాదు. పైకి కనిపిస్తోన్న జబ్బునే కాదు, అందుకు మూల కారణాలను కూడా తెలుసుకోవాలనుకుంటాడు. ఇప్పుడు కావేరి అనుమానం విన్నాక ఆవిడను మరికొన్ని ప్రశ్నలడిగాడు. అలాగే ఆవిణ్ణి కాసేపు ముందుగదిలోకి వెళ్ళి కూర్చోమని చెప్పి కీర్తనతో కూడా మాట్లాడాడు. ఆనక కీర్తనను పంపి తిరిగి కావేరిని రమ్మన్నాడు.

ఇదంతా చూస్తోన్న కావేరికి అయోమయంగా అనిపించింది. కూతురికి ఏమైందాని తెగ కంగారుపడిపోతూ "ఏమైందండీ మా అమ్మాయికి?" అనడిగింది.

"ముందు మీరు రిలాక్స్ అవండి, తనకేమీ కాలేదు" అని చెప్పినా భయం తగ్గలేదు ఆవిడలో.

"మీరు సావధానంగా వింటానంటే నేను మీతో రెండు నిమిషాలు మాట్లాడ్తాను"

"అయ్యో చెప్పండి"

"పాప పేరేంటి, కీర్తన కదూ... షీ ఈజ్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్.. కానీ.."

ప్రశ్నార్థకంగా చూసింది.

"చాలామంది తల్లిదండ్రుల్లాగే మీరు కూడా అమ్మాయిని చాలా ఇబ్బంది పెడుతున్నారు"

"ఛఛ, అలాంటిదేమీ లేదండీ.. కీర్తనతో ఒక్క పని కూడా చేయించను.. చిన్న, పెద్ద అని లేకుండా అన్నీ నేనే చూసుకుంటాను"

డాక్టర్ నవ్వి "పని చేయిస్తే మంచిదే, అందుకెవరు తప్పుపడ్తారు? అదేం చెయిల్డ్ లేబర్ కాదు" అని ఒక క్షణమాగి "చదువు పేరుతో తనని చాలా ఇబ్బంది పెడ్తున్నారు" అన్నాడు.

కావేరి తేలిగ్గా ఊపిరి పీల్చుకుని "కానీ ఇవాళున్న పోటీని తట్టుకోవాలంటే ఆమాత్రం శ్రమపడాలి కదండీ.. ఈ ఐదారేళ్ళు కష్టపడితే ఇక జీవితాంతం సుఖపడొచ్చు, కాదంటారా?!"

"ఎంత చెట్టుకు అంత గాలి అని ఒక సామెతుంది. ఒక్కో మనిషి అవగాహనాశక్తీ ఒక్కోలా వుంటుంది. మీరిచ్చే కోచింగ్ అందుకు తగ్గట్లుండాలే కానీ మించకూడదు. కీర్తన ఆ వత్తిడిని తట్టుకోలేకపోతోంది. స్ట్రెస్ ఎక్కువైనందునే లేనిపోని జబ్బులొస్తున్నాయనిపిస్తోంది"

"బాగా చదివి ఎందరు పైకి రావడంలేదు డాక్టర్? అందరూ ఒత్తిడనుకోవడంలేదే?!" అంది కావేరి, చదివించకపోతే తన కూతురెక్కడ ప్రయోజకురాలు కాకుండా పోతుందోననే బాధతో.

డాక్టర్‌గారు కోపం తెచ్చుకోకుండా "చాలామంది చేస్తోన్న పొరపాటే ఇది. పిల్లలకి ఏది ఇష్టమో అది చదివించండి.. అలా కాకుండా పక్కింటాయన తన కొడుకును ఇంజనీరింగ్ చదివించాడు గనుక మనమూ చదివించాలి.. అనుకుంటే మాత్రం లాభం కంటే నష్టమే వాటిల్లుతుంది. నిజంగా పిల్లల శ్రేయస్సు కోరుకునేట్లయితే వాళ్ళని వత్తిడికి గురిచేసి మానసికంగా నలిగిపోయేలా చేస్తామా? రేపెప్పుడో సుఖపడ్డం సంగతలా వుంచండి, ముందు వాళ్ళు ఆరోగ్యంగా వుండాలి కదా?!" అన్నాడు శాంతంగా.

కావేరికి లక్ష సందేహాలు కలిగాయి. 'ఇప్పుడే వత్తిడి, వంకాయా అంటే ఇక ఇంటర్లో ఎంత సొంపుగా చదువుతుంది? తర్వాత ఎం.సెట్., ఆపైన మెడిసిను... ఇవన్నీ కల్లలేనా?' అని నిట్టూరుస్తూ దిగాలుగా చూసింది.

"నేనొక్క మాట అంటాను, కోపం తెచ్చుకోకండి... మెడిసిను, ఇంజనీరింగు తప్ప ఇతర కోర్సుల్లేవా? ఇష్టమైనవాళ్ళు కష్టపడైనా చదువుతారు, బాగానే వుంది.. కానీ బలవంతాన ఎందుకు చదివించాలి? అలా అయితే అందులో వాళ్ళేం రాణిస్తారు? అనవసరమైన మెంటల్ స్ట్రెయిన్ తప్ప ఒరిగేదేం వుంటుంది, మీరే ఆలోచించండి"

కావేరి మౌనంగా తలాడించింది.

"...ఇందాక కీర్తన చెప్పింది, తనను ఆడుకోడానిక్కూడా మీరు పర్మిట్ చేయరని.. పిల్లలు హెల్దీగా పెరగాలంటే ఇతర పిల్లల్తో కలిసి ఆడుకోవడం కూడా ముఖ్యమే.. మీరేమో తనకి బాల్యమే లేకుండా చేస్తున్నారు.. ఇలా చెప్పిందని పాపను కోప్పడేరు, అది మరీ ప్రమాదం.. ఈ కాంపిటీటివ్ వరల్డ్, నాన్సెన్స్ గురించి కాసేపు పక్కనపెట్టి అమ్మాయికెలా సంతోషం కలిగించాలా అని ఆలోచించండి" అని జోడించారు డాక్టరు.

కావేరి చేతులు రెండూ జోడించి బయల్దేరింది. ఆమెలో ఇప్పుడే ఆలోచన మొదలైంది.

మనం కూడా పిల్లల విషయంలో కావేరిలా ప్రవర్తిస్తున్నామేమో ఒకసారి చెక్‌చేసుకోవాల్సిన అవసరం వుంది.

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(పెత్తనం చేయడమేగానీ, పొలంపనులు ఎన్నడూ అలవాటులేని పటేలు తప్పనిసరై నారుకట్టలు మోసుకెళ్ళి మడినిండా నారు పరిచేసరికి వంటినిండా చెమటలు పట్టుకొచ్చాయి)

(21 వ భాగం)

తెలంగాగడ్డ

"గోటి మీదికి మొక్క ఎక్కిచావడంలేదు. ఏంచేయమంటావు?" అంది శాంతమ్మ.

"ఇట్లా వేస్తే నారంతా ఈ మడికే సరిపోద్ది. కాస్త ఆలస్యమైనా జాగ్రత్తగా వేయండి" అన్నాడు పటేలు.

అప్పటికి పొంటెలు విడిచారు. ఎడ్లను పాలేళ్లకు తోలిపెట్టి గజ్జెలరెడ్డి అక్కడికొచ్చాడు.

"నేను కాసేపు నారు మోస్తాలే కూర్చోయ్యా" అన్నాడు.

"ఇప్పటిదాకా అరక్కొయ్య దున్నినవాడవు నారేం మోస్తావులే.. ఇంటికెళ్లు. అన్నంతిని పెందలకడ ఎడ్లు తోలుకరండి" అన్నాడు పటేలు.

గజ్జెలరెడ్డి ఇంటికి బయలుదేరాడు. నాటువేస్తున్న శాంతమ్మ నిలబడి "ఒరే అబ్బాయి, ఉట్టిమీద పాలున్నాయి. కాస్త వాటిలో తోడువేయరా, మరచిపోయేవు సుమా?" అని చెప్పింది.

గజ్జెలరెడ్డి తలూవుతూ ఇంటికెళ్లిపోయాడు.

''బావయ్యను కాసేపు నారు మోయనీయకపోయావా మావయ్యా" అంది పూర్ణమ్మ.

"నేను మోయలేననుకున్నావా ఏమిటే?" అన్నాడు పటేలు నవ్వుతూ.

''అది ఇవ్వట్నుండే మొగుడితో పనిచేయించాలని చూస్తోంది" అంది శాంతమ్మ.

''మొగుడు వని చేస్తుంటే చూడాలనుకుందేమో, మధ్య నీకేమిటి?" అన్నాడు పటేలు.

పూర్ణమ్మ సిగ్గుతో తలొంచుకుని నాటు వేస్తోంది. ఆమెను ఏడిపించాలని తలచాడు పటేలు.

''ఏమే పూర్ణా, మా అబ్బాయిని చేసుకోవూ?" అనడిగాడు.

పూర్ణమ్మ నిటారుగా లేచి నిల్చుంది. "మామయ్యా, నా ప్రాణంపోయినా మీ అబ్బాయిని చేసుకోను" అంది. ఆమె ముఖం కోపంతో మండిపోతోంది.

పటేలు తెల్లమొగం వేశాడు.

సీతమ్మ కలిగించుకుని మాట్లాడింది. "అది హద్దు, అదుపు లేకుండా పెరిగిన పిల్ల. దానితో నీకెందుకన్నయ్యా?" అంది.

పూర్ణమ్మ తల్లివైపుకు చురచుర చూస్తూ తిరిగి నాటు వేయడానికి వంగింది. అంతలో పక్క పొలంలోనుండి కూలీలు ఒక్కసారిగా నవ్వుతూ కేరింతలు కొట్టుతుండడం వినిపించింది. అందరూ తలలెత్తి ఆ వైపుకు చూశారు.

"కన్నూ మిన్నూ కనిపించడం లేదు" అన్నాడు పటేలు తలూపుతూ.

"ఆ నవ్వులు, కేరింతల్ని ఏమిటంటారు? మనల్ని పరాచకాలు పట్టించడం" అంది సీతమ్మ.

"పొంగేదంతా కుంగేటందుకేలే" అన్నాడు పటేలు తలూపుతూ.

"ఆ ఎదవల కల్లే చూసేదేమిటి? మీ పని మీరు కానీయండి" అన్నాడు పటేలు. అప్పుడే నల్లని మేఘాలు పట్టుకొచ్చి మండిపడుతున్న సూర్యబింబానికడ్డు పడ్డాయి. వాయువ్య దిశనుండి చల్లనిగాలి వచ్చి వంటికి తగిలింది.

"అబ్బ, ఎంత చల్లగా ఉంది" అన్నాడు తిరిగి.

"నీ కష్టం చూడలేక దేవుడు మేఘాలను పంపి నీడ కల్పించాడులే అన్నయ్యా" అంది సీతమ్మ.

పటేలు నిట్టూర్చాడు. "దేవుడికంతగా నా మీద దయ ఉంటే కూలీలనే పంపేవాడు కదమ్మా" అన్నాడు. ఫెళఫెళమని నడినెత్తిన మేఘాలు ఉరిమినయ్. అటు, ఇటు దిక్కులు చూశాడు.

"పడమర దిక్కుగా వాన, మంచి పట్టుబడే పట్టింది" అన్నాడు జానకిరాంరెడ్డి.

"మావయ్యా, నారుకట్టలు తేవాలి" అంది పూర్ణమ్మ.

పటేలు నెమ్మదిగా నారుమడి వైపుకు నడిచాడు. సన్నని చినుకులు ప్రారంభమై చూస్తుండగానే జడివానగా మారిపోయింది. నారుకట్టలు ఎత్తుకుని వెనుకకు తిరిగేసరికల్లా ఆయన గుడ్డలన్నీ పూర్తిగా తడిసిపోయినయ్. నెత్తినుండి కిందకు నీరు ధారాపాతంగా కారిపోతోంది. కళ్ళు మూస్తూ, తెరుస్తూ తప్పటడుగులు వేస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు. పక్కగెనెం మూలమీద గొడుగు వేసుకుని నిలబడ్డ కోదండరాంరెడ్డి పలుకరించాడు.

"పటేలూ, ఎందుకొచ్చిన పట్టుదలయ్యా ఇదీ!" అన్నాడు.

పటేలు గిర్రున వెనక్కి తిరిగాడు. రెప్పలల్లారుస్తూ చూశాడు. అంత వానలోనూ పళ్ళు పటపట నూరాడు. "దీనికంతటికీ నీవే మూలకారణం. లోలోపల కూలీలకు పురెక్కించి నా పొలం నాటువేయకుండా కట్టు కట్టించింది నువ్వు కాదూ?" అన్నాడు.

"పటేలూ, అభాండాలు వేస్తున్నావు సుమా?" అన్నాడు కోదండరాంరెడ్డి.

"ఛీ... మేకవన్నెపులివి, నిన్ను నమ్మకూడదు. అయినా ఇంతకింత ఎప్పుడైనా అనుభవిస్తావ్ జాగ్రత్త" అన్నాడు. గిర్రున లేచి ఆవేశంతో చరచరా ముందుకు నడిచాడు. ఆ తొందరలో అతడి కాలు జర్రుమని జారింది. మరుక్షణమే నిలువెత్తున ఉన్న బండ కట్టపైనుండి విరుచుకుని మడిలోకి పడ్డాడు. అతడి ముఖం బురదలో కూరుకుపోయింది. అతడి చేతుల్లోని నారు కట్టలు చెల్లాచెదరుగా పడిపోయినాయి. అది



చూసి కోదండరాంరెడ్డి గొడుగునక్కడే వదిలి ఆదుర్దాగా పోయి బురదలో పడ్డ పటేలును రెండుచేతులా పట్టి లేవనెత్తాడు. అవతల మడిలో నాటు వేస్తున్న జానకిరాంరెడ్డి మిగతా ఆడవాళ్లందరూ పటేలు పడిపోవడం చూసి ఆదుర్దాగా అక్కడికి పరిగెత్తుకుని వచ్చారు. వారందరూ వచ్చేటప్పటికి పటేలు వంటికిపట్టిన బురదంతా వాన దెబ్బకు పూర్తిగా కారిపోయింది.

"కిందపడ్డావా అన్నయ్యా?" అంది సీతమ్మ.

"ఏమన్నా దెబ్బతగిలిందా?" అంది శాంతమ్మ.

"ఇక నీవు మోయలేవు, ఇంటికిపో బావయ్యా" అన్నాడు జానకిరాంరెడ్డి.

పటేలు మారుమాట లేకుండా కిందపడిపోయిన కట్టలన్నింటినీ ఏరుకుని ఏతమడివైపుకు నడిచాడు. అతడివెంట మిగతా వారంతా వెళ్లిపోయారు. కోదండరాంరెడ్డి వారందరివైపుకు విచిత్రంగా చూస్తూ నిల్చున్నాడు.

* * * *

రాత్రి ఝాము పొద్దుపోయింది. వాన జోరుగా కురుస్తోంది. మధ్య హాలులో మంచంపై నిండా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు పటేలు. ఆవేళ పొద్దుగూకులూ నారు మోయడంతో అతడి గూడల్లో నుండి నూదిపోట్ల మాదిరి బాధ పుట్టుకొస్తోంది. కాళ్లు పీక్కుని పోతున్నాయి. తల దిమ్ముగా ఉంది. గొడ్డుమాదిరి మూలగనారంభించాడు. అప్పుడే శాంతమ్మ లోపలినుండి వచ్చింది.

"ఏమయ్యా లేచి అన్నంతినవూ?" అంది.

ముసుగు తలవరకు తొలగించాడు పటేలు. "ఒళ్లు పులిసినట్టుంది. ఈపూట అన్నమొద్దు" అన్నాడు.

"ఈ పూట ఏమీ తీసుకోకపోతే రేపు పొద్దున్నే లేవగలవూ?" అందామె.

"ముందు మీరంతా తినండి. తర్వాత నా సంగతి చూద్దాం"

"ఇంకా అందరూ ఎవరున్నారయ్యా? పెద్దోడు తిని పడుకున్నాడు. చిన్నపిల్లలంతా తిండి తినకుండానే నిద్దర్లకు పడ్డారు. వాళ్లనిప్పుడు లేపడమూలేదు, పెట్టడమూ లేదు... నువ్వు లేచిరా"

పటేలు ముసుగు పూర్తిగా తొలగించుకుని లేచి కూర్చున్నాడు. కాని అతడి కుడి తొంటి కదలనీయడం లేదు. భార్యను దగ్గరికి పిలిచాడు. ఆమె ఆసరాతో నెమ్మదిగా లేచి కుంటుతూ వంటగదివైపుకెళ్లాడు. అతి ప్రయాసతో పీటపై కూర్చున్నాడు. ఆమె అన్నం పళ్లెం తెచ్చి ముందుంచింది.

"కాస్త కలిపి పెడుదూ, గూడలు కదలనివ్వడంలేదే" అన్నాడతడు.

"నా చేతులు బాగా చచ్చినయా? చేతులూ, కాళ్లూ పచ్చిపుళ్ళయిపోయి రసి కారుతున్నాయి" అని ఆమె తన రెండు చేతులను భర్తకు చూపించింది. ఆమె చేతులు పాచిపోయి, పగిలి పులినీరు కారుతుండడం కనిపించింది. మారు మాట్లాడకుండా నెమ్మదిగా కలుపుకుని తిననారంభించాడు. ఆమె అతడికెదురుగా కూర్చుంది.

"ఏంటో ఇంతబతుకూ బతికి ఇన్నాళ్ళకు, ఈ వయసులో నారుకట్టలు మోయడం, నానా చాకిరీ చేయడం నీ చేతనవుద్దా? బండకట్టమీదనుండి విరుచుకుని పడిపోతివి. ఇంకా నయం ఏ కాలో, చేయో విరగలేదు. ఇదంతా ఎందుకొచ్చిన పట్టుదల? ఎవరిని సాధించడానికి?" అందామె.

"అబ్బబ్బా ఆగవే. అసలే నా మనసంతా చికాగ్గా ఉంది. ఇంకా చిరాకెందుకు తెచ్చిపెడతావు?" అన్నాడు.

"చికాకు కాదయ్యా, బాగా ఆలోచించు.. ఈ వేతలు, చేతలు మనవల్ల అయ్యేపనేనా అంట?"

పటేలు తలూపాడు. "రేపటి నుండి అరకలు విడిచేయించి పాలేళ్లను కూడా నాటుకు తీసుకుపోవాలి" అన్నాడు.

"వాళ్లను నాటుకు తీసుకుపోతే అరకలెట్టా సాగుతయయ్యా మరి?"

"నాటుకొచ్చిన పొలం బోలెడుంది. ఇంకా దున్నుకోవడం ఎందుకూ?"

"పొద్దున్నే లేచి పాలేళ్లతో ఆ మాటైనా చెప్పు. పాలేళ్లూ, మనమూ అయితే రేపటికి ఒక్క ఎకరమైనా అవుద్ది"

"సరేలే" అన్నాడు. అప్పటికతడు కూరతో భోంచేయడం పూర్తయింది.

"పెరుగు తెచ్చేదా?" అందామె.

"పెరుగేనుకుంటే మరీ చలి ఎక్కువకాదూ?"

"పాలు కాసిని పోయించుకో. ఇంకా పొయ్యి మీదనుండి దింపనేలేదు, వేడిగానే ఉంటయిలే" అంది. ఆమె పాలు తెచ్చిపోసింది. అతడు అన్నంలో కలుపుకుని తాగాడు.

"చేయి పళ్లెంలోనే కడుక్కుందూ! బయటికేం పోతావు?" అందామె.

చేయి పళ్లెంలోనే వేసి కడుక్కుని లేచాడు.

"ఆగవయ్యా ఈ ఎంగిలి కంచం తీసేసివస్తాను"

'ఎందుకులేవే అట్టాగే మంచం చేరుకుంటాలే" అన్నాడతను. గోడను ఆసరా చేసుకుని నెమ్మదిగా మంచం చేరుకున్నాడు. తలవైపు దిండు కిందనున్న పొగాకు కాడతీసి చుట్టచుట్టుకుని కాల్చుకున్నాడు.

కాసేపటికి శాంతమ్మ భోంచేసి వచ్చింది.

"తొంటికేమైనా కాపు పెట్టమంటావా?" అంది.

"ఇప్పుడేముంది?"

"ఉడుకు బూడిద గుడ్డలో వేసి కాపుతాను"

"సరే" అంటూ అతడు తలూపాడు.

ఆమె పొయ్యిలోని ఉడుకు బూడిదను గుడ్డలో వేసుకొచ్చింది. అతడు పడుకుని తొంటిపైనున్న గుడ్డను తొలగించాడు. ఆమె అతడిపక్కన కూర్చుని తొంటిపై కాపుతోంది. ఆమె స్పర్శతో అతడు బాధలన్నీ మర్చిపోయాడు. ఆమె వెన్నుపై చేయివేసి నిమిరాడు.

"సరసాలు చాలుగాని ఆ చెయ్యి తీయ్" అందామె.

"అబ్బబ్బా ఇప్పుడు నిన్నేమన్నానూ?" అన్నాడతను.

"బాబో ఇక నావల్ల కాదు. ఇప్పటికే ఈ పిల్లలతో చస్తున్నాను"

"ఎందుకే అట్లా విసుక్కుంటావు?"

"పొద్దుగూకులూ వంచిన నడుం ఎత్తకుండా, నాటువేసి వచ్చేసరికి నావని అయిపోయింది. నీకొక దండం, నీ సంసారానికొక దండం" అందామె.

ఆమె మాటలకు అతడు నవ్వాడు. అంతలోనే ఉయ్యాల తొట్టిలో ఉన్నపిల్ల కేర్‌మంటూ లేచింది.

"నీ పోరు, నా పోరు పిల్లతీర్చిందిలే" అన్నాడు.

ఆమె లేచి ఉయ్యాల్లో ఉన్న పిల్లను తీసి పక్కలో వేసుకుని పడుకుంది.

"ఈ తిప్పలన్నీ కాకపోతే పొలమంతా కౌళ్లకు ఇచ్చి పారెయ్యరాదూ?" అందామె.

"నిజమే ఈ పాలేళ్లతోనూ, కూలీలతోనూ నానా బాధలూ పడుతూ వీళ్లపై ఆధారపడేదానికంటే కౌళ్లకు ఇవ్వడమే నయం. కానీ..."

"కానీ ఏమిటయ్యా? వచ్చే సంవత్సరం మగతాలకిచ్చేయి. ఈ బాధలన్నీ తప్పుతాయిగదా, హాయిగా ఇంట్లో కూర్చోవచ్చును"

"నిజమే. కాని, కౌళ్లవాళ్లకే భూములు కబ్జా అయిపోతున్నాయనేమాట పుట్టిందీ మధ్యన"

"కబ్జా అయిపోవడం ఏమిటి?"

"స్వాధీనం అయిపోవడం. అసలు పది సంవత్సరాలు ఒకడికే కౌలుకిచ్చినట్లయితే వాడికే పట్టాకూడా అయిపోతుందట"

"అట్లా అయితే మన పొలాలు ఎవరికీ కౌళ్లకివ్వద్దు. చేసుకున్నంత వరకు చేసుకుందాం, పండించుకుందాం" అందామె.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

అమృత

యూత్ ట్రెండ్ మారింది

యూత్ ట్రెండ్ మారిపోయింది. కొందరు సమ్మర్ కటింగ్ చేయించుకుంటే, మరికొందరు తల వెంట్రుకలు భుజాల్ని తాకేట్టు పెంచుకుని, వాటికి రకరకాల షేడ్స్‌లో రంగులు వేయించు కొంటున్నారు. ఇక స్లీవ్‌లెస్ టీ షర్టులు, సీ త్రూ జుబ్బాలతో స్లిమ్‌గా ఉన్న బాడీని ప్రదర్శనకు పెడుతున్నారా? అనిపించే విధంగా బైక్‌మీద రైయ్... రైయ్ మంటూ పరుగులు తీస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటి కుర్రాళ్ళ ట్రెండే మారిపోయింది. గత ఏడాది ఓ బడా కంపెనీ "మగవాళ్ళ కోసమే..." అంటూ ఫెయిర్‌నెస్ క్రీమ్‌ను ప్రవేశపెట్టటం, అది అనూహ్యంగా సక్సెస్ కావటంతో కార్పొరేట్ వ్యాపారవర్గాల దృష్టి యువకులపై పడింది. అవి కొత్తపోకడలకు తలుపులు తెరిచాయి.

బ్యాంక్ ఆఫీసర్ రాధాశ్యామ్‌నే చూద్దాం... ఆయనకి ఇద్దరు పిల్లలు. ఓ అమ్మాయి, అబ్బాయి. ఇద్దరూ ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ చేస్తున్నారు. గత ఏడాది కాలేజీలో చేర్పించే సమయంలో దాదాపు ఇద్దరికీ ఒకేవిధంగా ఖర్చులయ్యాయి. అయితే ఈ ఏడాది కాలేజీ ఫీజులు కట్టకముందే అబ్బాయిగారి ఖర్చులు రెట్టింపయ్యాయట! కారణం ఏంటని కొడుకు గురించి ఆరాతీస్తే... ఎండకు మొహం వసివాడకుండా ఫెయిర్‌నెస్ క్రీమ్, బైక్ మీద వెళ్ళేప్పుడు చేతులు నల్లబడిపోకుండా సన్ స్క్రీన్ లోషన్‌లూ పట్టిస్తున్నాడట. ఇక షేవింగ్ క్రీమ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోనవసరంలేదు. అంతే కాకుండా పదిహేనురోజులకోసారి బ్యూటీపార్లర్‌కు వెళ్ళి ఫేషియల్స్ దట్టిస్తున్నాడట. ఇక ఇప్పుడు కాలేజీ తెరిచే టైమ్ కావటంతో తనకిష్టమైన డ్రస్సులు దొరకట్లేదని గంటల తరబడి షాపుల వెంట తిరుగుతున్నాడట!

ఇదే అంశాన్ని అతనితో ప్రస్తావిస్తే, "ఏంటీ నేను దుబారా చేస్తున్నానా? ఎంతమాత్రం కాదు. కాలానుగుణంగా ఖర్చుపెడుతున్నాను. ఫేస్ ప్యాక్‌లు, బ్లీచింగ్, నోస్‌ప్యాక్, థ్రెడింగ్, హెయిర్ స్ట్రెయిటెనింగ్, హెన్నా, మసాజ్, వంటి వాటి జోలికి నేను



వెళ్ళలేదే. అంతేకాదు, జుట్టుకి రకరకాల షేడ్స్‌లో ఫ్యాషన్ డైయింగ్ చేయించుకోవడం, చెవి తమ్మెలు కుట్టించుకోవడం చేయలేదే. టీ షర్ట్స్, కుర్తాస్, షార్ట్స్, ఫేడెడ్ జీన్స్, నేరోకట్, బూట్‌కట్, స్లీవ్‌లెస్ టాప్స్... ఇలా ఎన్నో వచ్చాయి. నేను అవి కావాలీ... ఇవి కావాలీ... అని అడగలేదే. ఫార్మల్‌గా ఉండాలనే లూయిీ ఫిలిప్, పీటర్ ఇంగ్లండ్, పార్క్ ఎవెన్యూ... లాంటి బ్రాండెడ్ డ్రస్ మెటీరియల్ తీసుకున్నాను. లేటెస్ట్ ఫ్యాషన్స్‌కి తగ్గట్టుగా నా వార్డ్‌రోబ్ మార్చుకోకపోతే నా ఫ్రెండ్స్ నన్ను కరివేపాకును తీసేసినట్టు తీసేస్తారు..." అంటాడీ హైదరాబాదీ టీనేజర్.

నిజమే ఇప్పటి టీనేజర్స్‌తో పోలిస్తే అతను ఖర్చుపెట్టింది చాలా తక్కువే. ఒక్క రోజు ప్రోగ్రామ్‌లో వేసుకోటానికి ఖరీదైన జామేవార్ సిల్క్ డ్రస్, లేదా షేర్వానీ నిండా ఖాళీ లేకుండా వర్క్ చేసిన డ్రస్సు, దానికితగ్గ తలపాగా, సాక్సు, షూస్?! కాని తమ ఆర్భాటాన్ని ప్రదర్శిస్తున్న కుర్రకారు చాలామంది ఉన్నారు.

ఇవాళ అమ్మాయిలతో సమానంగా అబ్బాయిల ఫ్యాషన్లు మారిపోతున్నాయి. మగవాళ్ళకోసం ప్రత్యేకంగా బొటిక్‌లూ వచ్చేశాయి. ఇప్పుడు ఎలా కనిపిస్తున్నామన్న అంశంపై టీనేజర్స్‌లో శ్రద్ధ విపరీతంగా పెరిగింది. హెయిర్ స్టయిల్‌తో మొదలై వేసుకునే బట్టలు, యాక్సెసరీస్... ఒకటేంటి అన్నింటిలో తమ ప్రత్యేకతను చాటుకోవాలనుకుంటున్నారు. ఇప్పుడు చెవులకు స్టడ్స్, చేతులకు బ్రేస్‌లెట్స్, మెడలో గొలుసులు, వీటిలో రకరకాల డిజైన్లూ హంగులూ. అయితే మగవాళ్ళు కావటంతో ఉన్నవాటిలో కాస్త రఫ్‌గా కనిపించే వాటిని ఎంపిక చేసుకుంటున్నారట. అచ్చమైన బంగారం కాకుండా పల్లాడియం గోల్డ్‌తో తయారైన గొలుసులైతే మరింత ఇష్టపడుతున్నారు. ఇక జీన్స్ వేసుకున్నప్పుడు పెట్టుకునే బెల్టు బకిల్ నుండి వేసుకునే నగల వరకూ అంతా ట్రెండీగా ఉండాలం టున్నారు. ఈ ఏడాది యువత దృష్టి సిల్వర్ ఆర్నమెంట్స్‌పై పడిందట. దీంతో సిల్వర్ కీ చైన్స్‌కు గిరాకీ పెరిగింది. డ్రస్ మారినప్పుడల్లా బెల్ట్ బకిల్‌తోపాటు, షూ కూడా మారాల్సిందే. వీటికితోడు కచ్చితంగా ఓ బైక్ తప్పనిసరి.

యూత్ ఎంపిక గురించి బేగంపేట్‌లోని ఓ రెడీమేడ్ షాప్ ఓనర్ మాట్లాడుతూ, "ఇప్పటి జనరేషన్ డ్రస్ విషయంలో చాలా కరెక్టుగా ఉంటోంది. వాళ్ళకు కావలసిన కలర్ షేడ్, బ్రాండ్ చెపుతారు. ఉంటే తీసుకుంటారు, లేకపోతే మరో షాపుకు వెళ్తున్నారు. షేడ్ విషయానికొచ్చేసరికి చాలా నిక్కచ్చిగా ఉంటున్నారు. ఏమాత్రం కన్విన్స్ కావట్లేదు..." అంటాడు.

ఏది ఏమైనా పోటీ ప్రపంచం కావటంతో కుర్రకారు కోర్కెలకు కళ్ళాలు వేయలేకపోతున్నారు. ఈ ట్రెండ్‌లో డబ్బున్నవాళ్ళు దర్పాన్ని ప్రదర్శించుకుంటుంటే, మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కు మాత్రం నడ్డివిరుగుతోంది.

*

సినిమా కబుర్లు

చందు

హాస్య నటుడు రాళ్ళపల్లి చెప్తోన్న కబుర్లు...



మర్చిపోలేని భయంకర సంఘటన

ఆర్. నారాయణమూర్తిగారి 'భూ పోరాటం' చిత్రం షూటింగ్ పెద్దాపురం దగ్గర కట్టమూరులో జరుగుతోంది. సినిమాలో అద్భుతమైన వేషం వేశాను. ఆరోజు షూటింగ్ ముగించుకుని మరుసటిరోజు కాట్రగడ్డ రవితేజ దర్శకత్వంలో రాజేంద్రప్రసాద్, రాధిక హీరోహీరోయిన్లుగా 'కొత్త పెళ్ళి కూతురా రారా...' అనే చిత్రం ప్రారంభోత్సవంలో పాల్గొనాలి. వేదిక మద్రాస్‌లోని ఎ.వి.యం స్టూడియో. 'బ్యాలెన్స్ పాటను పూర్తిచేసి హౌరా కాకుండా బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్ళండి' అని నారాయణమూర్తిగారు అడగడంతో అలాగేనని ఒప్పుకోవాల్సివచ్చింది. బొకారో సమయానికి వస్తుందో రాదో తెలీదు. ఒకవేళ లేటైతే వాళ్ళని ఇబ్బందిపెట్టిన వాడినవుతాను అనుకున్నా మనసులో. అనుకున్నంతా అయింది. బొకారో సామర్లకోటకు తొమ్మిదింటికి వచ్చింది. రాజమండ్రి చేరుకునేటప్పటికి అర్ధరాత్రి 12 అయింది. దీన్ని నమ్ముకుంటే మద్రాస్ ఎప్పుడెళ్ళేను? ఇలాగైతే గమ్యస్థానం చేరుకునే పరిస్థితి లేదని రాజమండ్రిలో దిగేశాను.

నా కాల్షీట్లు చూస్తున్న మహేశ్వరి ఫిలిం డిస్ట్రిబ్యూటర్, నిర్మాత వెంకన్నబాబును కలిసి పరిస్థితి వివరించాను. మరేం చేద్దామని ఆయనడిగితే గన్నవరంనుంచి మద్రాస్ వెళ్ళే ఫ్లైట్ ఉదయం ఉండొచ్చనుకుంటున్నానని చెప్పాను. ఆయన కారు ఏర్పాటుచేసి జేబులో వెయ్యి రూపాయలు పెట్టి పంపించారు. అర్ధరాత్రి రెండుగంటల ప్రాంతంలో బయల్దేరాను. బాగా నిద్రపట్టింది. తెల్లవారుజామున ఐదుగంటల ప్రాంతంలో కారు పాములా వెళ్తోన్న ఫీలింగ్ కలిగింది. కళ్ళు తెరచి చూసేటప్పటికి ఎదురుగా బట్టలమూటతో సైకిలిస్టు వస్తున్నాడు. కారెళ్ళి వాణ్ణి గుద్దింది. సైకిల్ నాలుగు ముక్కలైంది.

గుద్దిన తర్వాత డ్రైవర్ నిద్రమత్తు వదిలి ఈలోకంలోకొచ్చి 'గురువుగారూ, బండి లాగించేద్దామా?' అన్నాడు. 'గుద్దింది కాకుండా అతడు చచ్చాడో బతికాడో చూడకుండా లాగించేద్దామా అంటావేంట్రా?' అని మందలించి సైకిలిస్టుని కారులో ఎక్కించుకుని అతని ఊరు భీమడోలు తీసుకెళ్ళాం.

సినిమా యాక్టర్ ఎవరో వచ్చారని జనం మూగడం ఓ పక్క... భర్త చచ్చిపోయాడన్న లెవెల్లో భార్య ఏడుపులు పెడబొబ్బలకు లంఘించుకోవడం మరో పక్క... ఊర్లో జనమంతా పోగయ్యారు. 'ఏమైనా ఇక్కడినుంచి కదలడానికి వీల్లేద'న్నారు. ఇంకా నేనెక్కడికి వెళ్తానయ్యా అని చెప్పి లోకల్‌గా ఉన్న నాగభూషణరావు అనే డాక్టర్‌గారిని సంప్రదించి అడిగితే... 'ప్రాణాపాయం ఏమీ లేదు. కాలు బెణికుంటుంది. నేను ట్రీట్‌మెంట్ ఇస్తాను, మీరెళ్ళండి' అన్నారు. సైకిలిస్టు భార్యను ఓదార్చి 'అమ్మా... మీ ఆయన ఎన్ని నెలలు బట్టలు అమ్ముకోలేని పరిస్థితి ఉంటే అన్ని నెలలు, నెలకు ఎంత సంపాదిస్తాడో అంత మొత్తాన్ని నేను ఏర్పాటు చేస్తాను' అని చెప్పి వెంకన్నబాబు ఇచ్చిన 1000, నారాయణమూర్తి ఇచ్చిన 500 రూపాయిలు డాక్టర్‌కి ఇచ్చాను. 'ఒకవేళ ఈ డబ్బులు ట్రీట్‌మెంట్‌కు సరిపోకపోతే దీన్ని కూడా ఉపయోగించుకోమ'ని నా దగ్గరున్న పగడపు ఉంగరాన్ని డాక్టర్‌గారికి ఇచ్చాను.

తీరా విజయవాడ వెళ్తే గన్నవరంనుంచి హైదరాబాద్‌కి ఉంది కానీ, మద్రాసుకు ఫ్లైట్ లేదన్నారు. చివరికి చేసేదేమీలేక విజయవాడలో పదకొండుగంటలకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి మద్రాస్‌లో రాత్రి ఏడున్నరకు దిగాను. సినిమాలో నన్ను తీసేసి వేరే ఎవరినో పెట్టుకుని ఉంటారనుకున్నా. మర్నాడు ఉదయం షూటింగ్‌కు వెళ్తే 'ఏంటి మామా, నిన్న కాల్షీటు ఎగ్గొట్టేశావు. కొత్త కథ చెప్పడానికి వచ్చావా?' అని రాజేంద్రప్రసాద్ ఆటపట్టించడం మొదలుపెట్టాడు. 'మీ సంగతి నాకు తెలుసు. ఏదో జరగకూడనిది జరిగితే తప్ప మీరు కాల్షీటు ఎగ్గొట్టే రకం కాదు' అని దర్శకుడు అనేసరికి మనసు కుదుటపడింది.

డాక్టర్‌కి ఫోన్‌చేస్తే కాలు విరిగింది. మూడునెలల వరకు సైకిల్ తొక్కడానికి వీల్లేదన్నారు. సినిమాకు సంబంధించి ఈ పని పూర్తయిన వెంటనే వంశీగారి దర్శకత్వంతో తణుకులో రూపుదిద్దుకుంటున్న 'స్వరకల్పన' షూటింగ్‌లో జాయినవ్వాలి. అక్కడికి వెళ్ళేటప్పుడు దారిలో భీమడోలు వెళ్ళి సైకిలిస్టును కలిశాను. బట్టలమ్మి నెలకు ఎంత సంపాదిస్తావని అడిగితే కనీసం రెండువేలు వస్తాయన్నాడు. నీవు మళ్ళీ సైకిల్ తొక్కగలిగి బట్టలు అమ్ముకోగల్గితే సరేసరి. లేని పక్షంలో ఫోన్ చేస్తే డబ్బులు పంపిస్తానని చెప్పి ఆరువేలిచ్చి షూటింగ్‌కు వెళ్ళిపోయాను. జీవితంలో మర్చిపోలేని భయంకర సంఘటన ఇది.

క్యారెక్టర్ చిన్నదా, పెద్దదా అని పక్కన పెడితే....

వేషం చిన్నదైనా పేరు తీసుకొచ్చే పాత్రలు కొన్ని ఉంటాయి. అలాంటివాటిలో 'సీతాకోక చిలుక' చిత్రంలో పోషించిన పాత్ర ఒకటి. శరత్‌బాబు ఇంట్లో నాది పనిమనిషి క్యారెక్టర్. ఆ ఇంటి ఎదురుగా ఉన్న గుడిసెలో నేనూ, నా భార్య ఉంటాం. శరత్‌బాబు భార్య సిల్క్‌స్మిత. నేనోసారి బజారుకెళ్ళినపుడు నా భార్యను పాడుచేయడానికి శరత్‌బాబు గుడెసెలోకి వెళ్తాడు. ఆయనలా వెళ్ళడం సిల్క్‌స్మిత చూస్తుంది. అదే సమయంలో నేను వస్తాను. నన్ను గుడెసెలోకి వెళ్ళనీయకుండా 'పులుసు మరిగిపోతోంది.. బజారుకెళ్ళి అది తీసుకురా, ఇది తీసుకురా' అని పని పురమాయిస్తుంది. పొద్దున్నే పనిమీద వెళ్ళానమ్మా. బాగా అలసటగా ఉంది. లోపలికెళ్ళి గంజి తాగి పోతానంటే లోపలికి వెళ్ళకుండా ఆపటానికి ప్రయత్నిస్తుంది. అదే సమయంలో శరత్‌బాబు నా భార్యను పాడుచేసి బయటకు వస్తాడు. ఇంత ద్రోహం చేస్తావా అని నేను చూడడం... సిగ్గుతో శరత్‌బాబు తలొంచుకోవడం... మొగుడు చేయకూడని తప్పు చేశాడని సిల్క్‌స్మిత బాధపడడం... సైలెంట్ షాట్స్ బాగా వచ్చాయి. పెట్టేబేడా తీసుకుని 'అయ్యా! వెళ్ళొస్తాను'నంటే 'ఎక్కడికి వెళ్తున్నావ్' అనడుగుతాడు శరత్‌బాబు. 'మనుషులుండే చోటి'కంటే, 'సరే నీ ఇష్టం వచ్చినట్లు వెళ్ళు' అని 500 రూపాయలు ఇవ్వబోతాడు. 'నాకెందుకయ్యా... కాళ్ళు నొప్పి పుట్టేటట్లు కాపలా కాసింది కదా! అమ్మగారికి ఇవ్వండి' అంటాను. ఆ డైలాగ్‌కి ఆడియన్స్ ఇప్పటికీ చప్పట్లు కొడుతూనే ఉంటారు. క్యారెక్టర్ చిన్నదా? పెద్దదా? అని పక్కనపెడితే గుర్తుండిపోయే మర్చిపోలేని మంచివేషం అది. నేనింతవరకు 750 సినిమాల్లో నటిస్తే చెప్పుకోదగ్గ పాత్రలు 20,30 పోషించి ఉంటాను. అలాంటి సినిమాల పేర్లు, క్యారెక్టర్ పేర్లు, డైలాగ్స్ ఇప్పటికీ జ్ఞాపకమే.

(ఇంకా వుంది)

వేలాడే తోట కావాలా!



"ఇదేంటి విచిత్రంగా వుందే. అయినా వేలాడే తోట ఏంటి?" అనుకుంటున్నారా! అదే మరి కేవలం మా చిన్నారులకోసం వేం ఇస్తున్న కానుక ఇది. మీరు ఇదంతా చక్కగా చదివేసి వేలాడే తోటను తయారు చేసెయ్యండి. తర్వాత మీ ఫ్రెండ్స్‌కు చూపించి ఫోజు కొట్టండే. మరి మొదలెడదామా!

ఏమేం కావాలంటే... మిల్క్ పౌడర్ ప్యాకెట్టు (అట్టపెట్టెలాగా వుంటుంది), పెన్సిళ్లు చెక్కుకునే చాకు, హోల్ పంచ్ (రంధ్రాలు వేసేది), దారం, కుండీలలో పోసే మట్టి, త్వరగా మొలకెత్తే విత్తనాలు (దనియాలు, ఆవాలు), నీళ్లు.



ఎలా చేయాలంటే...

ముందుగా చాకుతో అట్టపెట్టె పైభాగాన్ని తొలగించాలి. ఇప్పుడు చూస్తే మూతలేని డబ్బాలా వుంటుంది (1వ బొమ్మ). హోల్ పంచ్‌తో పెట్టెకు నాలుగువైపులా నాలుగు రంధ్రాలు వెయ్యండి. ఇప్పడు సమానమైన పొడవున్న దారాలు నాలుగు తీసుకుని రంధ్రంలో దూర్చి ముడి వెయ్యండి. తర్వాత ఈ నాలుగు దారాలను కలిపి చివరలో ముడివెయ్యండి. ఇప్పడు పెట్టె సగం వరకు మట్టి పొయ్యండి. తర్వాత త్వరగా మొలకెత్తే విత్తనాలు చల్లి, నీళ్లు చిలికించండి (2వ బొమ్మ). ఇప్పడు దీన్ని సూర్యరశ్మి తగిలే చోట తగిలించండి. మూడు నాలుగు రోజుల్లో ఎంచక్కా మొక్కలు మొలకెత్తుతాయి. అంతే! వేలాడే తోట సిద్ధమైనట్టే. చూడ్డానికి ఎంతో బావుంటుంది. మరి చేసెయ్యండీ.



చెట్టుతో చేసినవేవి?



హేయ్! పై బొమ్మలో బోలెడన్ని వస్తువులు వున్నాయి. వాటిలో ఆటబొమ్మలూ చాలానే వున్నాయనుకోండి. మరైతే వాటిలో చెట్టుతో (పేపరు, చెక్క) చేసినవేవో చెప్పకోండి చూద్దాం.

మూడును ఐదు చెయ్యగలరా!



చిన్నారులూ...! ఇవాళ మనం అగ్గిపుల్లలతో పజిల్ చెయ్యబోతున్నాం. అర్రే! మరీ అంత సంతోషమా! కాస్త మేం చెప్పేది కూడా వినండర్రా!

పక్కన మూడు చతురస్రాలు వున్నాయికదా. మీరు సరిగ్గా ఆరు అగ్గిపుల్లలను కదిల్చి ఐదు చతురస్రాలను తయారు చేయాలి. ఏంటి? అంతగా డీలా పడిపోతున్నారు. ప్రయత్నించి చూడండి.

జవాబు



ఎంతకీ తెలీకపోతే మాత్రం పక్కనున్న జవాబు చూడండి. అందాకా చూశారా! మీతో పచ్చి కొట్టేస్తాం. మరి అందుకే మీరు జవాబువైపు ఒక్కటంటే ఒక్కసారికూడా చూడకుండా ప్రయత్నించండే.

రంగులు అద్దేద్దాం

హలో! ఏంటి అటెటో చూస్తున్నారు. నేను!! అబ్బా ఇంకా తెలీలేదా. బొమ్మలో వున్నానుకదా. హమ్మయ్య. ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషం. మళ్లీ స్కూళ్లకు వెళ్లాలికదా. అందుకే పుస్తకాలు తీశా. ఏమో అనుకున్నా కానీ కథల పుస్తకాలు చదువుతుంటే భలే మజాగా వుంది. అందుకే నా దగ్గరున్న పుస్తకాలన్నీ తీసుకొని వదలకుండా చదివేస్తున్నా. ఇంతకీ నేను మీకేం చెప్పాలనుకున్నానంటే... నా బొమ్మకు అదిరిపోయే రంగులు అద్దండి. సరేనా!

ఏమేం ప్రాణులున్నాయో!

నేస్తాలూ... పై బొమ్మలో కొన్ని పక్షులు, జంతువులు వున్నాయి. ఏది ఎక్కడ వుందో, మొత్తం మీద ఎన్ని వున్నాయో గుర్తించండి చూద్దాం.

చిన్నారి చిత్రకారులు



పాగల నాగప్రశాంత్, 8వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, బసినికొండ, చిత్తూరు.

బండారు దుర్గాప్రసాద్, 9వ తరగతి, ఎస్‌సి.బోయిస్ హాస్టల్, తూ.గో.



ఎస్.అనురాగ్, 6వ తరగతి, బండారుగూడెం, మనుగూరు.

మీకూ ఈ నేస్తాల్లా బొమ్మలు వేసి పంపాలనివుందా? మరైతే ఆలస్యం ఎందుకంట? వెంటనే తెల్ల కాగితం తీసుకుని బొమ్మ వెయ్యండి. దానికి నలుపు స్కెచ్‌తో ఔట్‌లైన్ గియ్యండి. తర్వాత మీకు నచ్చిన రంగులు అద్దండి. ఇంక మాకు పంపండి. అంతే... మేం ప్రచురిస్తాం. మా చిరునామా:

చిన్నారి చిత్రకారులు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.

అట్టమీది కథ

నేలంటి మధు

చదువుల బరువులు ఘరూ...!

"మా వాడిని కేరళ టీచర్లున్న రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాను. వాడికి ఇంగ్లిషు రాదు. ఏదైనా ఇంగ్లిషులోనే అడగాలి. బాత్రూంకెళ్ళినా ఇంగ్లిషులోనే మాట్లాడాలి. ఇంగ్లిషులో మాట్లాడలేకపోతే అవసరాలు తీరవు. అలాంటప్పుడు వాడేం చేస్తాడు. చచ్చినట్లు ఇంగ్లిషు నేర్చుకుంటాడు" ఆరేళ్ళ పసివాడిని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించిన ఓ తండ్రి సంతోషపడుతూ చెప్పిన మాటలివి.

"మా స్టూడెంట్స్‌నయితే తెల్ల వారురఝాముున నాలుగు గంటలకే ఫోన్‌చేసి నిద్రలేపుతాను. ఒక్కసారి ఫోన్ రింగ్ కాగానే వాళ్ళు ఫోన్ తీయాలి. పిల్లలు కాకుండా వారి పేరెంట్స్ ఆ ఫోన్ లిఫ్ట్ చేశారంటే స్టూడెంట్ నిద్రలేవలేదని అర్థమన్నమాట. ఇక స్కూలుకు వచ్చాక ఉంటుంది వాళ్ళ పని" ఒక ప్రయివేటు పాఠశాల నిర్వాహకురాలు పేరెంట్స్‌కు చెప్పే మాటలివి.

"మా స్కూల్లోనయితే నైన్త్ క్లాస్ నుంచే టెన్త్ క్లాస్ లెసన్స్ స్టార్ట్ చేస్తాం. నైన్త్ క్లాస్ ఎగ్జామ్స్ ఐపోయాక సెలవులిచ్చే సమస్యే లేదు. మరునాటి నుంచే టెన్త్ క్లాసులు ప్రారంభమవుతాయి. రోజుకి 14,15 గంటలపాటు చదివిస్తూనే ఉంటాం" – ఇది తాము పిల్లలకు చదువులు ఎంత చక్కగా అందిస్తున్నామో తెలపడానికి ఒక పేరెంట్...ఒక హెడ్మాస్టర్...ఒక కరస్పాండెంట్ చెప్తోన్న గొప్పలన్నమాట.

చెప్పడమేకాదు, చేసి చూపిస్తున్నారు.

ఇది నేటి విద్యార్థులు అనుభవిస్తున్న దుస్థితి.

* * *

పిల్లలకు చదువు నేర్పించడానికి వాళ్ళనింత హింసించడం అవసరమా? అని చాలామంది ప్రశ్నిస్తూనే ఉన్నారు. కానీ 'మార్కుల'కోసం గింజుకునే తల్లిదండ్రులకు గానీ, ఎలాగైనా మార్కులు సంపాదించి పెట్టాలనే టీచర్లు, స్కూలు మేనేజ్‌మెంట్‌లకు గానీ ఇది వినిపించదు గాక వినిపించదు.

కాబట్టే జీవితమంటే ఏమీ తెలియని పసిపిల్లలు ఉసూరుమంటూ భావి జీవితంలోకి పయనిస్తున్నారు. తట్టుకోలేని మరికొంతమంది చిన్నతండ్రులు, చిట్టితల్లులు ప్రాణాలు తీసుకుంటున్నారు. అయినా కూడా వారి బాధలు పెద్దగా ఎవరూ చెవికెక్కించుకోవడం లేదు. వారి గురించి ఆలోచించడం లేదు. ఎవరెన్ని విధాలుగా ఏడ్చినా, మొత్తుకున్నా కూడా వారు చెప్పే మాట ఒకటే 'పోటీలో ముందుండాలంటే ఇదంతా తప్పదు కదా...!'ని

* * *

పిల్లలు... తల్లిదండ్రుల ఆశాదీపాలు. పేరెంట్స్ కోరికలు తీర్చే సాధనాలు. పెద్దలు జీవితంలో ఆశించి చేయలేని పనులను సాధ్యం చేసేందుకై పుట్టిన వంశోద్ధారకులు. అని తల్లిదండ్రులంతా భావిస్తున్నారు. ఓకే...మరి అలా అనుకుంటున్నందుకైనా వారు స్వేచ్ఛగా పెరగాలి కదా...?! మన కోరికలు తీర్చిపెట్టే సాధనాలు కాబట్టి దానికి కృతజ్ఞతగానైనా వారిని హాయిగా ఎదగనివ్వాలి కదా...?

చదువుల పేరిట వారిని ఇంతలా హింసించడం ఎందుకు...?

అయితే... చాలామంది అనుకుంటున్నట్లు పిల్లలు... తల్లిదండ్రుల ఆశాదీపాలు కారు. కోరికలు తీర్చుకునే సాధనాలు అసలే కాదు. మరెవరు...అంటే? ఈరోజు మన పిల్లలే కానీ. రేపు వారికి వారే సొంతదార్లు... ఎదిగిన మనుషులు... అందుకని వారు స్వేచ్ఛగా పెరగాలి. ఆలోచనాయుతమైన వ్యక్తులుగా ఎదగాలి.

* * *

పిల్లలు... ఉన్నతస్థానాలను అందుకోవాలి. మంచి పేరు తెచ్చుకోవాలి. ఉత్తమమైన జీవితాన్నందుకోవాలి – అనే కదా ప్రతి తల్లీదండ్రీ సాధారణ కోరిక...?!

మరి దానికోసం మన ఇష్టాయిష్టాలు, ఆలోచనలు, వింత పోకడలు... అవగాహనలేమితో కూడిన అసహజ చేష్టలు... మనం తీర్చుకున్న, తీర్చుకోలేని కోరికలను వారిపైన రుద్దడం అవసరమా? అంటే అనవసరమనే చెప్పాలి.

తల్లిదండ్రులే కాదు ప్రస్తుత

చదువుల విధానం... టీచర్లు... పాఠశాలల తీరు వలన పిల్లలకు బోలెడన్ని నష్టాలు కలుగుతున్నాయి. అసలు తల్లిదండ్రులు, టీచర్ల వల్లనే పిల్లలు చెడిపోతున్నారనేది కొందరి అభిప్రాయం.

.జీవితంలో వెనకబడు తున్నారు. వీరి ఒత్తిళ్ళు లేనినాడు వారు స్వేచ్ఛగా ఎదిగి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. తనకు, కుటుంబానికే కాదు, దేశానిక్కూడా పేరు తెస్తారు. ఇలా అంటే కొంతమంది కోప్పడవచ్చు కానీ ఇది వాస్తవం. తల్లిదండ్రులందరూ గ్రహించవలసిన చేదు నిజం. ప్రస్తుత చదువుల విధానం వలన నష్టాలు కలుగుతున్నాయని మనం చెప్పుకున్నాం. మరి ఆ నష్టాలేమిటంటే... వీటిని రెండు అంశాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది తల్లిదండ్రులు, రెండవది విద్యార్థి పరంగా.

తల్లిదండ్రుల పరంగా...

ప్రస్తుత 'హడావుడి'



చదువుల వలన తల్లిదండ్రులకు కోచింగ్ ఖర్చులు పెరుగుతాయి. అయినా కూడా అనుకున్న ఫలితం రాకపోవడం వలన దాదాపు వృథా ప్రయాసే అవుతుంది. ఆశాభంగంతో డిప్రెషన్ వచ్చి వేదన మిగులుతుంది. బాగా డబ్బు ఖర్చువుతుంది గనుక కొత్త తిప్పలు మొదలవుతాయి. పైగా పిల్లలు కూడా సొంత ఆలోచన లేనివారుగా మారి తల్లిదండ్రుల గుండెలమీద కుంపట్లుగా తయారవుతారు.

స్కూళ్ళల్లో కేవలం 'మార్కుల'కోసమే పిల్లలతో పుస్తకాలను 'బైహార్ట్' చేయించడం వలన ఉన్నత చదువులకోసం నిర్వహించే పోటీ పరీక్షలు రాయాలంటే వారు ప్రత్యేక శిక్షణ (కోచింగ్) తీసుకోవాల్సి ఉంటుంది. దానికోసం తల్లిదండ్రులు ఎన్నో తంటాలుపడి వేలు, లక్షల రూపాయిలు ఫీజులు కట్టాల్సివస్తోంది. ఇదో ప్రిస్టీజియస్ ఇష్యూగా మారింది. కాబట్టి అప్పు చేసైనా సరే కోచింగ్‌కు పంపించండం స్టేటస్‌గా మారింది. అయినా కూడా పిల్లలు ఎమ్‌సెట్‌లోనో, మరో దానిలోనో సక్సెస్ కాకపోవడంతో తల్లిదండ్రులు ఆశాభంగం చెందుతూ ఆవేదనకు గురవుతున్నారు. ఇక అక్కడినుంచీ పిల్లలను పట్టించుకోవడం మానేస్తున్నారు. దానితో వారు చెడు మార్గాల్లో పయనిస్తున్నారు. కొద్దోగొప్పో వారి గురించి ఆలోచించినా కూడా ఇక్కడ ఎదురైన 'ఫెయిల్యూర్' వారిని సమర్థనీయంగా ముందుకు సాగనీయడం లేదు. దానితో వారు శక్తి సామర్థ్యాలుండి కూడా 'సాధకులు' కాలేక నిస్సారవైన జీవితాలు గడుపుతున్నారు. మెజారిటీ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్య ఇది. అయితే వారు వివిధ కారణాలవలన బయటకు చెప్పలేకపోతున్నారు. పైగా కొందరు ఫాల్స్ ప్రిస్టేజీ కోసం మరికొన్ని తంటాలు పడడం, పిల్లలగురించి అబద్ధాలు చెప్పడం కూడా చేస్తున్నారు. ఇంతాచేసి దీని ప్రభావం మాత్రం ప్రతికూలంగాన

ే ఉంటుందన్నది జీర్ణించుకోలేని సత్యం.

పిల్లల పరంగా...

తల్లిదండ్రుల అవగాహనాలేమి, ప్రయివేటు పాఠశాలల ధనదాహం పిల్లలను 'మార్కుల' రేసులో పరిగెత్తిస్తూండడం వలన వారు ఎన్నో నష్టాలను ఎదుర్కోవలసి వస్తోంది. కష్టాలను భరించవలసి వస్తోంది. శారీరకంగానూ, మానసికంగానూ వారు కుంగిపోతున్నారు.

శారీరకంగా చూస్తే విద్యార్థి ఉదయం ఆరు, ఏడు గంటలకు లేచినది మొదలు హడావుడి పడుతూ స్కూలుకు తయారుకావడం బిస్కెట్లు, పాలు వంటివి 'ఏదో' కొంత తిని, తాగడం బండెడు పుస్తకాలను, నీళ్ళ సీసాను, తిండి సంచులను మోసుకుని బస్సులెక్కడం బడికి పోవడం చేస్తున్నారు. ఆ తినే తిండి వీరు చేసే పనికి ఏ మాత్రమూ సరిపోదు. దానితో అది లోలోపల విద్యార్థుల శారీరకశక్తిని కరిగిస్తుంది. పెద్దయ్యాక వారు శక్తి హీనులై 30 సంవత్సరాలకే జబ్బులు ప్రారంభమై 55,60 సంవత్సరాలు వచ్చే సరికి లేవలేని ముదుసలులుగా మారే ప్రమాదముంది.

ఇక పాఠశాలకు వెళ్ళి సాయంత్రం నాలుగు దాకా కూచునే ఉంటారు. మంచి అలవాట్ల పేరిట, బూట్లతో కాళ్లను బంధించడం, బెల్టులు, టైలతో ఒంటిని బంధించడం వంటివి దీర్ఘకాలం కొనసాగడం వలన శరీరం వికసించకుండాపోయే ప్రమాదముంది. ఇక పాఠశాలల్లో కూచుని తెలియని భాషల్లో చెప్పే పాఠాలను అర్థం చేసుకోలేకపోవడం, సందేహాలను బయటపెడితే ఏమంటారోననే భయంతో గడిపేస్తుంటారు. ఏ సాయంత్రానికో ఇంటికొచ్చాక చాలామంది విద్యార్థులు ట్యూషన్స్‌కు వెళతారు. అక్కడ ఏడు, ఎనిమిది గంటల దాకా రాతలు, చదువులతో గడిపేస్తారు. ఇంటికొచ్చి ఏ నాలుగుముద్దలో తిని అలసిపోయి పడుకుంటారు. ఇలా... ముగిసిపోయే రోజులో వారి శరీరానికి కాసింత ఎక్సర్‌సైజు కానీ, హాయిగా ఆటలతో గడిపే అవకాశంగానీ

ఎమ్‌సెట్ ఒక్కటే సర్వస్వమా?

అంటే కాదనే చెప్పాలి. కానీ తల్లిదండ్రులు ఈ విషయాన్ని మరిచినట్లే ప్రవర్తిస్తూ వాటికోసమే పుట్టారన్నట్లు పిల్లలపై ఒత్తిళ్ళు తెస్తున్నారు. ఎమ్‌సెట్‌కు ధీటైన కోర్సులు ఎన్నో ఉన్నాయి. కరస్పాండెన్స్ ఇంజనీరింగ్ కోర్సులూ ఉన్నాయి. వేలు, లక్షల రూపాయిలు సంపాదించే ఉద్యోగాలు తెచ్చిపెట్టే కంప్యూటర్ కోర్సులూ ఉన్నాయి. ఉన్నత హోదా, గుర్తింపు తెచ్చే సివిల్ సర్వీసు వంటి ఉద్యోగాలూ, ఇంజనీరింగ్ కన్నా అధికాదాయమందించే సీఏ, సీఏస్ వంటివీ అందుబాటులో ఉన్నాయి.

మెడిసిన్‌ను మించిన బయోటెక్, మైక్రోబయాలజీ, జెనెటిక్స్, బయో ఇన్ఫర్మేటిక్స్ వంటి పరిశోధనా కోర్సుల వంటివి ఉన్నాయి. మెడిసిన్‌కోర్సులకూ ప్రత్యామ్నాయాలున్నాయి.

ఒక ఇంజనీరు, ఒక డాక్టరు కన్నా ఒక మేనేజర్, ఒక పైలట్, ఒక ఫ్యాషన్ డిజైనర్ అధికాదాయాన్ని పొందుతారు. మరింత గుర్తింపునూ పొందుతున్నారు. రొటీన్‌గా...గుంపులో గోవిందా..లుగా ఉండే కంటే వీటన్నిటికీ మించి ఎక్కువ ఆదాయం, ఉన్నతమైన స్థానం, సామాజిక గుర్తింపు, హోదా... ఇలాంటి కోర్సులు చేయడం మంచిది. పిల్లలను అటువైపు మళ్ళిస్తే పేరెంట్స్‌కు ఆరాటముండదు. డబ్బు ఆదా అవుతుంది. పిల్లలకు వత్తిడి, డిప్రెషన్ ఉండవు. వెరసి సంతృప్తికరమైన ఉత్తమ జీవితం మీ పిల్లల సొంతమవుతుంది.

తల్లిదండ్రులూ కళ్ళు తెరవండి...!!!

ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే లాభాలున్నాయి.

ప్రభుత్వ స్కూళ్ళలో చదవడం వలన విద్యార్థులకు ఒనగూరే లాభాలూ బాగానే ఉన్నాయి. వాటిలో ప్రధానంగా చెప్పుకోదగినవి... 1. స్వేచ్ఛగా నేర్చుకునే అవకాశముంటుంది. 2. డబ్బుతో అవసరముండదు. 3. ఉచిత పాఠ్యపుస్తకాలు లభిస్తాయి. 4. ఎలాంటి ఒత్తిడీ ఉండదు. 5. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు అవకాశముంటుంది. 6. భవిష్యత్ జీవితాన్ని తీర్చిదిద్దే 'లైఫ్ స్కిల్స్'ను నేర్చుకునే అవకాశాలూ లభిస్తాయి.

చాలా స్కూళ్లల్లో ఇవి లేవుగా అంటారు చాలామంది. అయితే కొన్ని స్కూళ్ళల్లో ఇవి ఉన్నాయి. లేని స్కూళ్లల్లో పేరెంట్ - టీచర్స్ కమిటీ సాధనంగా వీటిని సాధించుకోవచ్చు. ఇలా సాధించుకుంటున్న స్కూళ్ళు, గ్రామాలు చాలానే ఉన్నాయి. వాటి అనుభవాల ఆధారంగా ప్రభుత్వ స్కూళ్లను మనకు అనుకూలంగా మలచుకుంటే మన పిల్లలు తిరుగులేని భవిష్యత్తును అందుకోగలుగుతారు.

లేదు. దానితో పుష్టికరంగా ఎదగాల్సిన వారు శారీరక ఎదుగుదలకు సంబంధించిన లోపాలతో పెరుగుతున్నారు.

ఇక బడిలో తమ భాష, సంస్కృతి, అలవాట్లు, ఆచారాలకు సంబంధం లేని పాఠ్యాంశాలు, అర్థం కాని బోధనలను వింటూంటారు. అర్థం కాలేదు, మరోసారి చెప్పండని స్కూల్లో అడగడం కానీ, ఇది అర్థం కాలేదు అని పేరెంట్స్‌కు చెప్పే పరిస్థితి గానీ లేదు. ఆలోచించే, హాయిగా గడిపే అవకాశమే లేదు. దానితో వారిలో అటు మానసికమైన ఆలోచనాశక్తే కాకుండా ఇటు భౌతికంగా ఎదుగుదల కూడా ఆగిపోతుంది.

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న విధానం వలన వచ్చే లాభాలేమైనా ఉన్నాయా? అంటే మార్కులు రావడం మినహా మరేమీ లేదు. పోనీ 70,80,90 శాతం మార్కులు సాధించడంవల్ల ఏమైనా ప్రత్యేక లాభముందా? అంటే మా పిల్లలకు ఇన్ని వచ్చాయని చెప్పుకోవడం కన్నా ఉపయోగమేం లేదనే చెప్పాలి. మార్కులతో కొన్ని ఉపయోగాలున్నాయి కానీ అవే సర్వస్వం కావు. వాటి కొరకే అంకితమై రాత్రీపగలూ చదవాల్సిన అవసరమేం లేదు.

మరేం చేయాలంటే పిల్లలను స్వేచ్ఛగా ఎదగనివ్వాలి. ఎదుగుదలకు తోడ్పాటునందించే చదువులను అందించాలి. అందుకు ఉపకరించే (శాస్త్రీయ విధానపు) చదువులను చెప్పించాలి. ఉపకరించే చదువులంటే...ఆలోచించేందుకు అవకాశమిచ్చే చదువులను, శారీరక ఎదుగుదలకు తోడ్పడే, భావి జీవితానికి మార్గం వేసే చదువులను చదివించాలి. ఆలోచనలను రగిలించి విద్యార్థుల ఆలోచనాశక్తిని పెంపొందింపజేయాలంటే బోధనా విధానాల్లో కొద్దిపాటి మార్పులు తేవాలి. మార్కుల కోసం కాకుండా విషయ అవగాహన కొరకు దోహదంచేసే విధానంలో చదువులు చెప్పాలి. విషయాన్ని నేర్చుకున్న విద్యార్థులు దానిని జీర్ణం చేసుకుని ఎదురైన సమస్యలను తీర్చుకోవడానికి అన్వయించగలిగేవిధంగా వారిని తీర్చిదిద్దాలి. అదే విధంగా శారీరక ఎదుగుదలకు అవసరమైన ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో తప్పనిసరిగా పాల్గొనేటట్టు చూడాలి.

తల్లిదండ్రుల పాత్ర

పిల్లలు మంచి చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలనందుకుని కీర్తి ప్రతిష్టలు ఆర్జించి మీకు కూడా పేరు తేవాలంటే మీరు వారికి స్నేహితుల్లా ఉండాలి. అంతేగానీ మీ కోరికలు వారిపై రుద్దుతూ వారిని ఒత్తిళ్ళకు గురిచేస్తూ వెనకబాటుకు గురిచేయకండి. ఈ కింది వాటిని పాటిస్తూ పిల్లల అద్భుత భవిష్యత్తుకు మార్గం వేయండి. ★ పిల్లల అభిరుచి, ఆసక్తిని గమనించి వాటికి తగ్గట్లుగా నడచుకోండి. ★ పిల్లల చదువులకు ప్రణాళికను వేసి వారికి తోడ్పడండి. ★ వేళకు తిండి, నిద్ర అందేటట్లు చూడండి. ★ పాఠశాలల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో వారికి విద్యనందేలా జాగ్రత్తలు తీసుకోండి. ★ ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనేలా ప్రోత్సహించండి. ★ సొంతంగా ఆలోచించి నిర్ణయించుకునేలా తర్ఫీదివ్వండి. ★ మీరు చేశాకనే వారికి చెప్పండి. (ప్రధానంగా టీవీ చూసే విషయంలో...ముందుగా మీరు టీవీ చూడడం మానేశాక వారితో మాన్పించండి. అంతేకానీ 'పెద్ద వాళ్ళము మేము చూస్తాము మీరు మాత్రం చూడకండి' అనేమాటలు మరచిపోవాలి) ★ వారికి 'క్వాలిటీ టైమ్' కేటాయించి కలిసిపోవాలి. అంటే ఆ పనీ, ఈ పనీ చేస్తూ వారి హోంవర్కులను పరిశీలించడం వారితో చదివించడం, కబుర్లు చెప్పడం కాకుండా పూర్తిగా వారిలో ఒకరుగా ఉంటూ వారితో గడపడాన్నే 'క్వాలిటీ టైమ్' అని భావించండి. ★ దగ్గరుండి హోమ్‌వర్కు చేయించండి. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు చేయొద్దు. ★ పదుగురితో సఖ్యతగా ఉండడం నేర్పించండి. ★ రెగ్యులర్‌గా పోటీ పరీక్షలు రాయిస్తూ ఉండండి. ★ ట్యూషన్‌లకు పంపించకుండా మీరే సొంతంగా వారి చదువులను పర్యవేక్షించడం మంచిది.

ఆరోగ్యం

వేదగిరి రాంబాబు

తొమ్మిదిమందికి జీవితాన్నిచ్చిన ఆదిత్య

చిన్న పిల్లల్ని సాధారణంగా చిరంజీవ... చిరంజీవ... అని దీవిస్తూ ఉంటాం. అలాగే పిల్లలూ, దేవుడూ ఒకటే అని భావిస్తుంటాం.

ఈ రెండు విషయాలూ నిజమని నిరూపించాడు మాస్టర్ ఆదిత్య కౌశిక్. అతని వయసు తొమ్మిదే అయినా తొమ్మిదిమందికి జీవితాన్నిచ్చాడు.

భౌతికంగా ఇబ్బందుల్లో ఉన్నవాళ్లను రక్షించిన వీరబాలుర గురించి విన్నాం. కాని ఈ వీరబాలుడు తాను మరణించిన తర్వాత కూడా తన అవయవాలతో మరికొందరి ప్రాణాలు నిలబెట్టాడు.

అది 2004వ సంవత్సరం. వేసవి సెలవుల్ని ఆనందంగా గడుపుతున్నాడు ఆదిత్య కౌశిక్. మియాపూర్‌లో వాళ్లిల్లు. ఇంటి ఆవరణలో పెద్ద గుల్‌మోహర్ చెట్టుంది. దానికి అందమైన పువ్వులున్నాయి. ఆ అందమైన పూలను కోయడానికి కౌశిక్ ఇంటిపైకెక్కాడు. పూలను వంగి కోయబోయాడు. పొరబాటున కాలుజారి కిందపడ్డాడు. ఈ సంఘటన 2004 మే 7న జరిగింది. వెంటనే ఆ కుర్రాడిని నాంపల్లి కేర్ హాస్పిటల్లో చేర్పించారు. కానీ ఆరోగ్యం మెరుగుపడలేదు. మే 9వ తేదీన బ్రెయిన్‌డెత్ చెందాడు.

అప్పుడు కౌశిక్ తల్లిదండ్రుల్ని మోహన్ ఫౌండేషన్ కలిసి కౌన్సిలింగ్ చేసింది. అవయవదానానికి అంగీకరింపజేసింది. మోహన్ ఫౌండేషన్ అంటే ఒక వ్యక్తిపేరుతో ప్రారంభించిన సంస్థకాదు. 'మల్టీ ఆర్గాన్ హార్వెస్టింగ్ ఎయిడ్ నెట్‌వర్క్' (ఎమ్ఒహెచ్ఎఎన్)కు కుదింపు పేరు. ఇది స్వచ్ఛంద సంస్థ. అవయవదాన విషయంలో ప్రజల్లో అవగాహనను పెంచడానికి కృషి చేస్తోంది.

ఆదిత్యకౌశిక్ తల్లిదండ్రులు సీత, దినేష్‌లు తమ పిల్లవాడి అవయవాల్ని దానం చేయడానికి అంగీకరించడంతో కొందరు ఆ అవయవాలసాయంతో మరణముఖం నుంచి వెనక్కు వచ్చి ఆరోగ్యవంతులయ్యారు.

తొమ్మిదేళ్ల పిల్లవాడు తాను మరణిస్తూ తొమ్మిదిమందికి ప్రాణం పోయడం ఎంత గొప్ప విషయం?! ఇటువంటి వాళ్లకివ్వాలి అవార్డులూ... రివార్డులూ... కాదంటారా?!





కథ

తేడా

సుమేరా

నితిన్ రెండు పెళ్ళిళ్ళు చేస్తున్నాడు. ఒకటి మేనకోడలు సుమిత్రది. రెండోది మరదలు (భార్య అక్క కూతురు) హారికది. ఇద్దరూ దగ్గరి బంధువులే అవడంతో సంబంధం కుదర్చడం మొదలు రిసెప్షన్ వరకూ బాధ్యతలన్నీ నితిన్‌పైనే పడ్డాయి. ఉన్నంతలో ఏ లోటూ రాకుండా జరిపించారు రెండు పెళ్ళిళ్ళూ.

* * *

సుమిత్ర తల్లి ఒక రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. తండ్రి ఇంకో పెళ్లి చేసుకుని అత్తారింట్లో సంసారం పెట్టాడు. దీంతో సుమిత్రను, ఆమె ఇద్దరు తమ్ముళ్లను అమ్మమ్మ భాగ్యమ్మ పెంచి పెద్దచేసింది. తాను బతికుండగానే మనుమరాలి పెళ్లి చేయాలని భాగ్యమ్మ పట్టుపట్టి సుమిత్ర పదోతరగతి పూర్తవగానే మంచి సంబంధం ఖాయంచేసింది. అబ్బాయి శంకర్ పెద్దగా చదువుకోలేదు. పదోతరగతితో చదువు ఆపేసిన శంకర్ ఒక కంపెనీలో కారు డ్రైవరుగా ఉద్యోగం చేస్తున్నాడు. అబ్బాయికి చెడు అలవాట్లేమీ లేవు. పైపెచ్చు పొదుపరి.

“నాకు కూతురైనా, మనవరాలైనా సుమిత్రే. అందుకే తల్లి లేదు, తండ్రి ఉన్నా లేనట్లే. ఏ లోటూ రాకుండా పెంచాను. పెళ్లి తర్వాత కూడా ఆమెకు ఏ ఇబ్బందీ రాదని మాటివ్వు. నా తర్వాత నా మనవళ్లకు కూడా నీవే దిక్కుగా ఉండాలి” అని పెళ్లిరోజున శంకర్‌ను కోరింది.

భార్యకు ఏ లోటూ రాకుండా చూసుకుంటానని శంకర్ హామీ ఇచ్చాడు. పెళ్లిలో రెండున్నర లక్షల విలువైన ప్లాటు, లక్ష నగదు, ఇతర సామాన్లు అలా భాగ్యమ్మ తనదగ్గర ఉన్నదంతా ఇచ్చి ఆర్భాటంగా పెళ్లి చేసింది.

* * *

అదే నెలలో హారిక పెళ్లి కూడా జరిగింది. ఈమె భర్త హరీష్ ఆదర్శమూర్తి. పైసా కట్నం తీసుకోలేదు. అలాగని అతడు ఆస్తిపరుడేమీ కాదు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. కానీ తనకోసం ఇతరులను ఇబ్బందుల్లోకి నెట్టకూడదన్నది హరీష్ ఉద్దేశ్యం.

“పెళ్లి ఖర్చులకై 30వేలు వడ్డీ లేకుండా అప్పుగా ఇవ్వండి. సాధ్యమైనంత త్వరగా తీర్చేస్తాన”ని హరీష్ పెద్దల సమక్షంలో వాగ్దానం చేశాడు.

* * *

శంకర్ అసలు స్వరూపం పెళ్లి తర్వాత బయటపడింది. చెడు అలవాట్లులేని శంకర్ పొదుపు పాటిస్తూ త్వరగా పైకొస్తాడని ఊహించిన భాగ్యమ్మ ఆశలు తలకిందులయ్యాయి. అత్తగారిచ్చిన ప్లాటులో కట్నం డబ్బుతోనే ఇల్లు కట్టుకున్నాడు. పెళ్లిలో అడగకుండానే ప్లాటు, నగదు ఇచ్చిన భాగ్యమ్మ వద్ద ఇంకెంత డబ్బుందో అనుకున్న శంకర్ మరింత డబ్బు తేహాల్సిందిగా భార్యను వేధించసాగాడు. పెళ్లికిముందు అద్దె ఇంట్లో ఉంటూ కష్టపడ్డ శంకర్ సౌకర్యవంతమైన సొంతింట్లో సుఖం మరిగి ఆశలు పెరిగాయి. అదే సమయంలో సుమిత్ర తల్లి యాక్సిడెంట్ కేసు ఓ కొలిక్కి వచ్చి మూడు లక్షలు ఇన్స్యూరెన్స్ డబ్బు రావడంతో శవంపై డబ్బులేరుకునే స్థితికి దిగజారాడు శంకర్. ఆ డబ్బులో తన భార్య వాటా ఇవ్వాలని భాగ్యమ్మతో తగవుకు దిగాడు. అది తన హక్కని వాదించాడు. పొదుపు, డబ్బు సంపాదనకు అతడిచ్చిన నిర్వచనం ఇది.

‘మీ అమ్మ చనిపోవడం వల్ల వచ్చిన పైకంలో నీ వాటా లక్ష. వెంటనే ఆ లక్ష రూపాయలు తీసుకురా’ అని భార్యకు హుకుం జారీచేశాడు.

‘మా అమ్మమ్మ, మామయ్యలు ఎంతో కష్టపడి నా పెళ్లిచేశారు. నేనేం ఇబ్బందులు పడకూడదని వాళ్ల ఆస్తి అమ్మి కట్నంగా

ఇచ్చారు. ఇన్సూరెన్సుద్వారా వచ్చిన సొమ్ము తమ్ముళ్ల చదువుసంధ్యల కోసం బ్యాంకులో దాచారేగానీ వాళ్లేం తిన్లేదుగా?!' అని నచ్చజెప్పబోయింది సుమిత్ర.

'నీకు బుద్ధిలేదు. ఆ డబ్బు తిని మీ మామయ్యలు పైకొస్తారు. పైగా నీ పెళ్లి చేశామని, నీ తమ్ముళ్లను ఉద్ధరించామని గొప్పలు చెప్పుకుంటున్నారు. కట్నంగా ఇచ్చిన ప్లాటు, డబ్బు అంటావా.. నలుగురు మామయ్యలు, అమ్మమ్మ ఆ మాత్రం ఇవ్వకుంటే ఎలా? ఇన్సూరెన్సులో వాటా తేకుంటే మన సంసారం సజావుగా సాగదు' అని హెచ్చరికతో కూడిన హితోపదేశం చేసిన శంకర్ భార్యను పుట్టింటికి పంపాడు.

'ఈ డబ్బుతో నీ బావమరుదులచేత వ్యాపారం చేయించాలనుకుంటున్నాను. నా డబ్బంతా కట్నం రూపంలో నీ చేతిలోనే పెట్టాను. నా తర్వాత ఈ పిల్లలకు నువ్వే దిక్కని కూడా చెప్పానుగా' అని భాగ్యమ్మ ఏడ్చింది. అయినా కనికరించని శంకర్ డబ్బు తెస్తేనే నీకు నా ఇంట్లో స్థానం ఉంటుందని భార్య సుమిత్రతో కరాఖండీగా చెప్పేసి వెళ్లిపోయాడు.

'కొన్నాళ్లు పోతే అల్లుడు మారతాడు. ఇంట్లో వంటావార్పుకు ఇబ్బంది తలెత్తితే అతడే వచ్చి భార్యను తీసుకెళ్తాడ'ని భాగ్యమ్మ మనవరాలిని తన వద్దే ఉంచుకుంది.

'సుమిత్రను పంపినా ముసల్ది భయపడలేదు. అడిగిన డబ్బు ఇవ్వలేదు. ఏ నాటికైనా వాళ్లు తెచ్చి వదిల్తేనే నీ భార్యతో సంసారం చేయి. ముసల్ది పోయాక నీ భార్యకు నీవు కాక మరెవరు దిక్కు? అందుకే వెనకడుగు వేయకు. వేస్తే నీ భార్య నిన్ను లెక్క చేయదు కనుక పట్టుదలగా ఉండు. ఏ నాటికైనా నీ భార్య వచ్చి కాళ్లు పట్టుకుంటుంది' అని శంకర్‌కు అతడి స్నేహితులు నూరిపోశారు.

దీంతో మరింత పట్టుదలకు పోయాడు శంకర్. భోజనం హోటల్లో చేస్తున్నాడు. ఒంటరితనాన్ని పోగొట్టేందుకు రోజూ మందు తాగుతున్నాడు. దీంతో సంపాదించేదంతా హోటల్‌కు, మందుకే సరిపోవడంలేదు. క్రమంగా

అప్పులు చేయనారంభించాడు. పాడైపోతున్నావని ఇరుగుపొరుగు, బంధువులు అంటే 'భార్య నన్ను వదిలి వెళ్లిపోయింది, ఆ బాధలో తాగుతున్నాన'ని సర్దిచెప్పుకునేవాడు శంకర్. పెద్దల హితబోధ ఫలించలేదు.

'పాపం నీకు చాలా కష్టాలు వచ్చాయి. నీ భార్యకు ఏం పోయేకాలం? పచ్చని సంసారాన్ని పాడు చేసుకుంటోంది. ఏమైనా ఆమెకు లొంగకు. నువ్విలా అయ్యావంటే నీ భార్యే కారణం' లాంటి కబుర్లు చెప్పేవాళ్లను చేరదీశాడు శంకర్. ఇలాంటి కబుర్లు చెప్పి తాము అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగివ్వలేదు. తన మేలుకోసం చెప్తున్నారని భావించిన శంకర్ వాళ్లడిగినంత డబ్బు ఇచ్చి మరింత అప్పుల్లో కూరుకుపోవడమేగాక ఆరోగ్యం చెడి ఆసుపత్రి పాలయ్యాడు.

ఆసుపత్రిలో శంకర్‌కు సపర్యలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అతడితో కలిసి తిని తాగినవాళ్లే 'పచ్చని సంసారాన్ని పాడు చేసుకున్నాడు. డబ్బు పిచ్చిలో భార్యను వేధించాడు. అతడికి తగిన శాస్తి జరగాల్సిందే' అని శంకర్ స్నేహితులు ముఖం చాటేశారు. చివరికి సుమిత్రకు విషయం తెలిసి ఆసుపత్రికి వెళ్లి శంకర్ కోలుకునే వరకూ కంటికి రెప్పలా చూసుకుంది. కోలుకున్న శంకర్ తాను నమ్మిన స్నేహితులు కనీసం పలకరించేందుకైనా రానందుకు బాధపడ్డాడు. ఎంత ఇబ్బంది పెట్టినా భరించి కష్టకాలంలో తనకు సపర్యలు చేసిన భార్యను ప్రేమతో అక్కున చేర్చుకున్నాడు.

* * *

హరీష్‌కు పెళ్లయ్యేనాటికి స్థిరమైన ఉద్యోగం కూడా లేదు. చిన్నాచితకా వ్యాపారాలు చేస్తూ చివరికి ఆటో డ్రైవర్‌గా స్థిరపడ్డాడు. అత్తింటివారు ఒక ఆటో ఇప్పించేందుకు ముందుకొచ్చినా 'పెళ్లి ఖర్చులకు తీసుకున్న అప్పు తీరేవరకు మరో అప్పు చేసేది లేద'న్నాడు. తెలిసినవాళ్ల దగ్గర ఆటో కిరాయికి తీసుకుని రోజుకు రెండొందలవరకూ



సంపాదించేవాడు. అందులో ఇంటి ఖర్చులకు పోను కొంత వెనకేసుకొస్తూ పెళ్లి ఖర్చులకై తీసుకున్న 30వేలను చెప్పినట్లుగానే రెండేళ్లలోగా తీర్చాడు.

'పెళ్లిలో కట్నంగా ఇచ్చిన డబ్బును మళ్లీ వాళ్లకివ్వడమేంటి. ఆ డబ్బుతో నీవు ఆటో తీసుకో' అని హరీష్ సోదరి సుకన్య నూరిపోసింది.

తన వాగ్దానాన్ని మర్చిపోని హరీష్ 'అమ్మాయిని భార్యగా స్వీకరించిన తర్వాత ఆమెను పోషించాల్సిన బాధ్యత నాది. నన్ను నమ్ముకుని తన వాళ్లనందరినీ వదిలి వచ్చిన హారిక తల్లిదండ్రుల వద్ద డబ్బు తీసుకుని భార్య దృష్టిలో చులకన కాదల్చుకోలేదు.

నా రెక్కల కష్టంతోనే పైకొస్తాను. కష్టమొచ్చినప్పుడు సహాయం తీసుకుంటా. గట్టెక్కిన తర్వాత మళ్లీ ఆ రుణాన్ని తీరుస్తా' అని సోదరికి నిర్మొహమాటంగా జవాబిచ్చాడు.

హరీష్ మంచి నడవడిక, వాగ్దానం నిలుపుకునే తత్వాన్ని గమనించిన బంధుమిత్రులు అతడికి అవసరమైనప్పుడు సంకోచించకుండా సాయం చేయసాగారు. అయితే ఇతరుల సహాయాన్ని కూడా ఆచీతూచీ తీసుకున్న హరీష్ అవసరమైనప్పుడు వాళ్లకూ సహాయం చేయసాగాడు.

ఫలితంగా మూడేళ్లు తిరిగేసరికి హరీష్ సొంత ఆటో కొనుక్కోగలిగాడు. అంతేకాదు అనారోగ్యంతో బాధపడ్తున్న తండ్రికి మెరుగైన చికిత్స కూడా అందిస్తూ అందరిలో ముఖ్యంగా అత్తింటి వారికి మంచి అల్లుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

ఆ పెళ్ళి విషయాలేవైనా గుర్తొచ్చినపుడు 'ఇద్దరూ ఒక వయసువాళ్ళే. రోజుల తేడాతో పెళ్ళిళ్ళయ్యాయి. అయితే జీవితాలు తారుమారైపోయాయి. ఎందుకింత తేడా?! హారిక భర్త మంచివాడైనందున సుఖంగానే వుంది. కానీ సుమిత్రకు ఇలాంటి భర్త దాపురించాడే... ప్చ్.. ఆడపిల్లలు కనీసం బాగా చదువుకుని తమ కాళ్ళపై తాము నిలబడితేనైనా ఇలాంటి ఆటుపోట్లను తట్టుకోగల్గుతారు' అనుకుంటాడు నితిన్.

సెన్సు కామన్ సెన్సు

నాగసూరి వేణుగోపాల్

నిత్యనూతనంగా సాగే రొటీన్ మోసం

'జ'పాన్‌వారి ఆధునిక జ్యోతిష్యం పరిజ్ఞానంతో తాత్కాలిక ధనయోగం మీ జాతకంలో కల్పించబడును. జాతకం కోసం నూటయాభై రూపాయలు మనియార్డర్ చేయండి ఆరునెలల్లో మూడు లక్షలు గ్యారంటీగా ఆర్జించగలరు. మనియార్డరు ఫారమ్‌మీద పుట్టిన ఊరు, సమయం, తేదీ, అడ్రసు స్పష్టంగా రాయాలి. ఒకవేళ ఏ వివరాలూ లేకపోయినను పేరునుబట్టి చెప్పగలం సంప్రదించండి... ఫలానా... ఊరూ... పేరూ... సెల్లు...'

ఆ ప్రకటన వున్న పేపర్ను విసిరి కొట్టింది ప్రవంతి. తర్వాత జయంతి, ప్రవంతి లైబ్రరీ నుండి బయటికి వస్తుంటే గేటుదగ్గర ఓ వ్యక్తి అటకాయించి విజిటింగ్ కార్డులు పంచుతూ కనిపించాడు. తీసుకోకుండా తప్పించుకు వెళ్ళాలని చూస్తోన్నవారికి వెంటపడి ఇస్తున్నాడు. వద్దంటే వదిలేట్టు లేదు. ప్రవంతికి మొదట ఇచ్చాడు. జయంతి మృదువుగా తిరస్కరించింది. బయటకు వస్తూ ప్రవంతి ఆ కార్డు చదివింది, చిటపటలాడింది.

"నూట యాభై రూపాయలు పంపితే వీరి జాతకం మారడం సంగతి ఏమోగానీ అందుకున్నవారి జాతకం మారుతుంది. చూడు... ఆధునిక జ్యోతిష్యంతో తాత్కాలిక ధనయోగమాట. ఆరునెలల్లో మూడులక్షలట......" దాదాపు అరచినంత పని చేసింది ప్రవంతి.

"అవునే... ప్రవంతి... ఆశలు ఆకాశంలో, ఆచరణ అధ:పాతాళంలో అంటే యిదే! జ్యోతిష్యం అంటున్నాడు.. పైగా జపాన్ వారి పరిజ్ఞానం అట! ఊరు, పేరు తేది సమయం రాస్తే చాలట. ఒకవేళ ఏ వివరాలూ లేకపోయినా పేరును బట్టి చెప్పగలరు" అంటూ జయంతి ఆ కార్డులోని లౌక్యాన్ని వత్తి పలికింది.

వారిద్దరూ అంతవరకూ గమనించని విషయం ఇంకొకటి కంటపడింది. కార్డులు పుచ్చుకుని ముగ్గురు నలుగురు ఒక గుంపుగా రెండు మూడు గుంపులుగా చర్చించుకోవడం కనబడింది.

"పోయేది నూటయాభై రూపాయలే... వస్తే ఆరునెలల్లో మూడు లక్షలు గ్యారంటీ కదా! ఒకసారి ఎందుకు ట్రైచేయకూడదు?" అని ఆ గుంపులో ఒకాయన బిగ్గరగా అంటున్నారు.

"ఇలాంటిదాని వల్ల మా ఫ్రెండ్ యిల్లు కొన్నారు తెలుసా?" అని మరోవైపు నుంచి మరొకరు.

"ఇదేమి పిచ్చిలోకంరా బాబు... మనం ఒకపక్కన వాళ్ళని తిట్టి పోస్తోంటే... వీళ్ళేమో కట్టకట్టుకుని బలవుతామంటున్నారు?" అని ప్రవంతి నోరు వెళ్ళబెట్టింది.

"అదే కదా విచిత్రం.. ఇటువంటి మాయాజాలాలు ఎప్పటికప్పుడు రూపాలు మార్చుకుని వస్తుంటాయి. అమాయక జనం అలాగే బోల్తా పడుతూ వుంటారు" అంది జయంతి.

"ఆరు నెలల్లో మూడు లక్షలు కాక పోయినా మూడు నెలల్లో లక్ష సంపాదించి ఉడాయించడం వారి వంతు. వీళ్ళేమో డబ్బులు పంపి అదృష్టలక్ష్మి వస్తుందని వేచిచూస్తారు. వాళ్ళేమో మరో ఊర్లో మరో స్కీమ్‌తో తయారవుతారు" అంది ప్రవంతి.

"అదేకదా... నిత్యనూతనంగా సాగే రొటీన్ మోసం" అంటూ ముక్తాయింపు పలికింది జయంతి.

❀



ఓ మంచి పుస్తకం

తెలకపల్లి రవి

అమూల్యానుభవం 'అక్షర'

గురువులకు, విద్యాదాతలకు శిష్యులు, వారి వల్ల ప్రేరణ పొందినవారు గౌరవంతో ఏదైనా సమర్పించుకోవడం సంప్రదాయకంగా వస్తున్నదే. పాత రోజుల్లో ఇదే గురుదక్షిణ. ఆధునిక కాలంలోనూ ఈ వరవడి ఏదో రూపంలో కొనసాగుతున్నది. అయితే మంచి గురువులు దక్షిణ కోసం ఏమాత్రం ఆశపడరు. ఇందుకు సంబంధించి మంచి కథ వుంది. ఒక గురువుగారు శిష్యులు పత్తిడి చేసిన మీదట పనికిమాలిన ఆకు దక్షిణగా తెచ్చిమ్మంటాడు. శిష్యులు రిక్తహస్తాలతో తిరిగివచ్చి క్షమించమంటారు. 'మీరు నేర్పిన విద్య కారణంగా ఏదీ పనికిమాలిందిగా కనిపించడం లేదు. అన్ని ఆకులలోనూ ఏదో ఒక ఔషధగుణం కనిపిస్తోంది' అంటారు. అప్పుడు గురువు 'నేను నేర్పిన విద్య సార్థకమైందని అర్థమైంది. ఇంతకన్నా నాకు వేరే దక్షిణ అక్కర్లేదు' పొమ్మంటాడు.

కెవి రమణారెడ్డి నుంచి బివి రాఘవులు వరకూ రెండుమూడు తరాల వామపక్ష భావ ప్రవంతులతో ముడిపడి కొనసాగుతున్న కావలి విశ్వోదయా, జవహర్ భారతి సంస్థల వ్యవస్థాపకుడు డి.రామచంద్రారెడ్డి అభినందన సంచికగా రూపొందిన అక్షర బృహత్ సంకలనం తిలకించినపుడు పై కథ మదిలో మెదిలింది. ఒక ప్రజాస్వామిక దృష్టితో ఆధునిక దృక్పథంతో ఆయన 50 ఏళ్ళ కిందటే ఈ సంస్థను స్థాపించారు. ఈ సందర్భంగా స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు వెలవరించిన ఈ సంచిక ఒక విలక్షణ, విభిన్న విజ్ఞాన సర్వస్వం. తెలుగులో అత్యంత అరుదైన ప్రచురణల్లో ఒకటిగా మిగిలిపోగల అమూల్య ప్రచురణ ఇది. 1200 పేజీలున్న ఈ మహా సంకలనం మనల్ని విజ్ఞానసీమల్లో విహారం చేయిస్తుంది. విజ్ఞాన డోలికల్లో తేలియాడిస్తుంది. కళా సాహిత్య సౌరభాలతో మైమరిపిస్తుంది. మానవ వికాస మహాప్రస్థానం కళ్లముందు నిల్పుతుంది. డి.ఆర్. అని అభిమానులు ఇష్టంగా పిల్చుకునే వ్యక్తి పాదుకొల్పిన సంస్కారం ఎలాటితో సంకలనం సంకేత ప్రాయంగా సాక్షాత్కరింపచేస్తుంది. విషయం మాత్రమే గాక వెల కూడా అమూల్యమే అని ప్రకటించి జిజ్ఞాసువులకు పెద్దలను దీన్ని పంపుతున్నారు. ఇప్పటికి రెండు మూడు చోట్ల విజ్ఞులు ఈ పుస్తకాన్ని గురించి ఎంతో తన్మయత్వంతో మాట్లాడటం విన్నప్పుడు సంకలనకర్తల సంకల్పం సార్థకమైందనిపించింది.

ఈ మహా గ్రంథంలోని విషయాలను రేఖామాత్రంగా ప్రస్తావించాలన్నా చాలా అవుతుంది. కలవారి కోడలు కలికి కామాక్షి అంటూ యస్వీ భుజంగరాయ శర్మ వ్యాసంతో మొదలైన సంకలనం ఆదిలోనే ఆంధ్ర సంస్కృతి రుచి చూపిస్తుంది. కలవారి కోడలు కలికి కామాక్షి పాట ఆధారంగా అప్పటి పరిస్థితులను సింహావలోకనం చేయించిన యస్వీ తెలుగు వారి పల్లెపదాలు, ప్రత్యేకించి స్త్రీల పాటలకు నీరాజనం సమర్పించుతారు. తర్వాతి వ్యాసం ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి కాళిదాసు కళామందిరం. కవి కుల తిలకుడుగా కీర్తించబడే కాళిదాసు కవితామృతాన్ని పంచడమేగాక అత్యంత రసవత్తరమైన ఎత్తుగడ, కొనసాగింపు ముగింపులతో ఇంద్రగంటి వారు సంప్రదాయ సాహిత్య పరామర్శ పద్ధతులు విదితం చేస్తారు. రాచరిక సాహిత్య పితామహుడైన కాళిదాసును కలుసుకున్న పాఠకుల ముందు మరుక్షణం శ్రామిక సాహితీ స్రష్ట మాక్సింగోర్కి నిలుచుని వుంటాడు. ఈ వ్యాసం తొలిరోజుల్లో కూర్మా వేణుగోపాలస్వామి, శేషుబాయిగార్లు రచించారు. గోర్కితో పాటు రష్యన్ సాహిత్యాన్ని



అక్షర డిఆర్ అభినందన్,

వెల : అమూల్యం, పేజీలు : 1200

ప్రతులకు : కె. తాతిరెడ్డి, సంగమిత్రా స్కూల్, కావలి - 524 201

విప్లవానంతర పరిణామాలను పరిచయం చేసి ఉత్తేజపరుస్తారు. అలా అలా రవీంద్రనాథటాగోర్ రచనా శైలి, గురజాడ మధురవాణి, శ్రీశ్రీ సాహిత్య ఝంఝు, దేవులపల్లి సుతిమెత్తని సాహిత్య రీతులు, కాటూరి వారి విమర్శ, కళ వ్యాసం, చలం చింతాదీక్షితులు, కొకు, గిడుగు, దివాకర్ల వెంకటావధాని, వేటూరి ప్రభాకర శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, రోణంకి అప్పలస్వామి, పింగళి నాగేంద్రరావు, రాళ్లపల్లి, సురవరం ప్రతాపరెడ్డి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, ప్రభృతుల ప్రామాణిక స్మరణీయ రచనా తోరణం కదలాడుతుంది. స్థానం నరసింహారావు నటనా వైభవం, త్యాగరాజ గాన సంకీర్తనం, అడవి బాపిరాజు లేఖినిలో ఆంధ్రుల చిత్ర శిల్ప కళా వైదుష్యం, నార్ల వెంకటేశ్వరరావు తొలి పాత్రికేయ జీవిత స్మృతులు, నటరాజ రామకృష్ణ స్వీయ కళాజీవితావలోకనం ఇత్యాదులు చూస్తాం.

అలా అని అన్నీ పాతకాలపు రచనలే అనుకున్నా పొరబాటవుతుంది. వకుళాభరణం, జ్వాలాముఖి, యన్.వేణుగోపాల్, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, కల్లూరి భాస్కరం, యువి నరసింహమూర్తి, ఛాయారాజ్, కొత్తపల్లి రవిబాబు, గుడిపూడి విజయారావు వంటి వారు ఆయా అంశాలపై రాసిన అత్యంత కాలీన ప్రాధాన్యత గల విషయాలు, మహామహుల జీవిత సందర్భాలు, సాహిత్య ధోరణుల పరామర్శలు ఇందులో చూస్తాం. దీంతోపాటే ప్రేమ్‌చంద్, ముల్క్‌రాజ్ వంటివారి రచనలు కూడా ఏర్చికూర్చి ఇచ్చారు. ఆంగ్ల విభాగంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, నెహ్రూ, ఐన్‌స్టీన్ వంటివారి రచనలతో సహా విలువైన ఖండికలున్నాయి. ఇలా కళలు, సాహిత్యం, చరిత్ర, నాగరికత, విమర్శ, రాజకీయాలు, మహా నేతల జీవితాలు అన్నింటినో ఒక్క చోట బృహత్ సంకలనంలో చూడటం ఒక గొప్ప అనుభవం. ఇందులో మొత్తం 200 వ్యాసాలు, ఖండికలు ఉన్నాయి. దీన్ని పూర్తిగా చదవడానికి ఎవరికైనా చాలా సమయం పడుతుంది. ఒక గొప్ప జ్ఞానతృష్ణను ప్రేరేపించే ఈ గ్రంథం సంపాదక వర్గం ముందుమాటలో చెప్పినట్టు అభినందన సంచికల వరవడిని మార్చే ప్రయోగం. ఆ విషయం అట్టపైన కూడా సూచించి వుంటే మరింత బాగుండేది. అలాగే రచనల తేదీలు, సేకరించిన గ్రంథాలు లేదా పత్రికల వివరాలు వుంటే భావితరాలకు ఎంతో ఉపయోగంగా వుంటుంది. ఎక్కడెక్కడి నుంచో ఇన్ని వ్యాసాలు ఓపిగ్గా సేకరించి ప్రచురించడం సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందన్నది నిస్సందేహం. సహజంగానే డిఆర్ వ్యక్తిత్వం, విద్యా రంగంలో ఆయన ప్రవేశానికి కారణాలు ప్రత్యేకతలు తెలిపే వ్యాసాలు కొన్ని వున్నాయి. సంస్థ వివిధ దశలకు సంబంధించిన చాయా చిత్రాలను అతిరథ మహారథులను చూస్తే మంచి సంస్థల అభివృద్ధి క్రమం వాటివెనక పునాది పురుషుల కృషి గోచరిస్తాయి. దీని సంపాదకవర్గ ఛైర్మన్ ఐవి చలపతిరావు కాగా జొన్నలగడ్డ మార్కండేయులు సంపాదకుడు. అనేకమంది మేధావులు ప్రగతిశీలులు సంపాదకవర్గంలో వున్నా విషయమే కాక రూపకల్పన, నాణ్యత కూడా ఉత్తమ ప్రమాణాలతో నేత్రపర్వం. అక్షర అక్షరాలా అమూల్యమైన సంకలనం. వీలైతే దాన్ని సంపాదించి చూడండి.

గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

నేను ఇంటర్‌మీడియట్ బైపిసి గ్రూపుతో పూర్తి చేశాను. అందులో 82.3 శాతం వచ్చింది. టెన్త్‌లో కూడా 83 శాతంతో మండలంలోనే ప్రథమస్థానం సంపాదించాను. దీంతో నాకు మంచి ప్రోత్సాహం లభించింది. భవిష్యత్తులో డాక్టర్‌ను కావాలని కలలు కన్నాను. కానీ నేను చదివిన కాలేజీ, ఇంటి వాతావరణం వలన నాకు ఎంసెట్‌లో 25000 ర్యాంక్ వచ్చింది. స్తోమత లేకపోయినా నా కోరికను లక్ష్యంగా పెట్టుకుని, ఈ సంవత్సరం కూడా ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నాను. డిగ్రీలో జాయిన్ అయ్యాను. కాని పరిస్థితులు అనుకూలించక పరీక్ష ఫీజు కట్టలేదు. అసలు కాలేజీకి వెళ్ళడం మానేశాను సార్. కోరుకున్నవాటినన్నింటినీ పేపర్‌లో రాసుకున్నాను. అలాగే మంచి సూక్తులు, విజయరహస్యాలు, జీవితంలో కష్టపడి పైకి వచ్చినవాళ్ళ ఫొటోలు సేకరించి, నేను చదువుకునే చోట ఎదురుగా గోడకు అతికించాను. ఇంట్లో యోగా కూడా ప్రారంభించాను. కానీ పరిస్థితుల ప్రభావం వలన సిలబస్ పూర్తి చేయలేకపోతున్నాను. ఇంట్లో నేను పెద్దవాణ్ణి. ఇద్దరు తమ్ముళ్ళు. నాన్న తాపీమేస్త్రీ. చదివినవి గుర్తుండాలంటే ఏం చేయాలి? నా లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలి? 'ఆత్మవిశ్వాసం విజయానికి పునాది' అన్న సూత్రాన్ని గుర్తుపెట్టుకుని చదువుతున్నాను. ఈసారి ఎలాగైనా మెడిసిన్‌లో సీటు సంపాదించాలని కోరిక. ఎలా చదవాలో, చదివినవి ఎలా గుర్తు పెట్టుకోవాలో దయచేసి సలహా ఇవ్వగలరు.

మాధవ్, హైదరాబాద్.

నీ ఆచరణలో కొన్ని లోపాలున్నాయి. సిలబస్‌ను పూర్తి చేయలేకపోతున్నావంటే దానికి తగిన కాలప్రణాళిక లేదని అర్థం. నువ్వు అసలు విషయాల కంటే కొసరు విషయాలకు సమయం కేటాయిస్తున్నట్లు అర్థం అవుతోంది. విజయరహస్యాలు తెలుసుకోవటం, విజేతల జీవిత చరిత్రలు చదవటం స్ఫూర్తినిచ్చే అంశాలే. అవి నిన్ను నీ లక్ష్యానికి చేరువ చేయడానికి ఉపయోగపడాలి. కానీ ఎక్కువ కాలాన్ని వాటికోసమే కేటాయిస్తున్నావంటే ఆ స్ఫూర్తినిచ్చే పుస్తకాలను కూడా నువ్వు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నావు. సిలబస్‌ను కాలపరిమితికి లోబడి పూర్తి చేయడానికి తగిన ప్రణాళిక రూపొందించుకో. అందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకో. కుటుంబ పరిస్థితులను సాకుగా చెప్పటం మానుకో. ఇలా చేస్తే విజయానికి తప్పక చేరువవుతావు.

నాకు 18 సంవత్సరాలు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. నేను ఒకామెని 3 సంవత్సరాల నుంచి ప్రేమిస్తున్నాను. అయితే నేను ప్రేమిస్తున్న సంగతి ఆ అమ్మాయికి 2 సంవత్సరాల తరువాత తెలిసింది. తరువాత ఆ అమ్మాయిని ఇంకొన్ని రోజులపాటు ప్రేమించాను కానీ ఇకపై ఆమెని ప్రేమించవద్దు అనుకుంటున్నాను. ఎందుకంటే 30 సంవత్సరాల వయసున్న ఒక వ్యక్తి నేను ప్రేమించే అమ్మాయికి సెల్‌నెంబరు ఇచ్చి 'ఏం కావాలంటే అది అడుగు, ఇస్తాన'న్నాడు. ఈ విషయం ఆమె ఇంట్లో చెప్పింది. ఇదంతా నాకు నా స్నేహితులు చెప్పారు. నేను ప్రేమిస్తున్న అమ్మాయిని నా క్లాస్‌మేట్ మరొకడు ప్రేమిస్తున్నాడు. అతను తాను ప్రేమిస్తున్న విషయం చెప్పలేదు. ఈ విషయాలన్నీ తెలిసి నేను ఇక ప్రేమించకూడదనుకున్నాను. కానీ ఆమె గురించిన ఆలోచనలే మెదులుతున్నాయి. ముఖ్యంగా చదువుకుంటున్న సమయంలో గుర్తుకు వస్తున్నాయి. డిగ్రీలో చేరాలంటే మార్కులు ఎక్కువ వస్తేనే చదివిస్తానని మా ఇంట్లోవాళ్ళు అంటున్నారు. నేను బాగా చదువుకుని స్థిరపడాలని మా ఇంట్లోవారికి, నాకూ కూడా ఉంది. ఈ పరిస్థితిలో నేను ఏంచేస్తే బాగుంటుందో మీరే సలహా ఇవ్వండి.

సంతోష్, కొంపల్లి.

ఎవరు ఎవరినైనా ప్రేమించవచ్చు. ఒకే వ్యక్తిని ఎంతమందయినా ప్రేమించవచ్చు. ఎవరి ఇష్టం వారిది. అయితే ఆ ప్రేమ ఫలప్రదం కావాలంటే యువతీయువకులు పరస్పరం అంగీకారాన్ని తెలుపుకోవడం అవసరం. నువ్వు ప్రేమించిన అమ్మాయిని వేరేవాళ్లు కూడా ఇష్టపడుతున్నంత మాత్రాన వదులుకోవలసిన అవసరం లేదు. అయితే ఆ అమ్మాయి నిన్ను ఇష్టపడుతోందో లేదో ధృవీకరించుకోవటం అవసరం. ఆ అమ్మాయి నిన్ను ఇష్టపడుతోందని తెలిస్తే ఇతరుల గురించి పట్టించుకోవటం మానేసి నీ ప్రేమ వ్యవహారం కొనసాగించు. నీ చదువు పాడవకుండా ప్రేమ వ్యవహారాలను కొనసాగించే సామర్థ్యం నీలో ఉంటే మీరు నిజంగా గొప్ప దంపతులుగా మారగల్గుతారు. కెరీర్ ట్రాక్‌లో ఉన్నపుడు ప్రేమ వ్యవహారాలు ఒక కాంప్లిమెంట్‌గా, సపోర్ట్ చేసేవిధంగా ఉండాలేకాని, అడ్డుగోడలుగా మారకూడదు. అలా బ్యాలెన్స్ చేసుకోగలిగే సామర్థ్యం నీలో ఉంటే ముందడుగు వెయ్యి. లేకుంటే ప్రేమ వ్యవహారాలు ప్రక్కనపెట్టి బుద్ధిగా చదువుకో.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

పెను తుపానులను ఆపగలమా?



ఆనాదిగా మానవుని భయపెడుతున్న ప్రకృతి వైపరీత్యాల్లో పెను తుపానులు ప్రముఖంగా చెప్పుకోతగ్గవి. మనకు పెను తుపానుల వల్ల ప్రమాదమైతే పశ్చిమ దేశాల వారికి హరికేన్ల వల్ల ముప్పు. తుపాన్లు వచ్చిన ప్రతిసారీ మనిషికి కలిగే కోర్కె వీటిని ఆపలేమా, అని. ఇటీవల అమెరికాలో హరికేన్ కత్రినా, రీటాలు సృష్టించిన బీభత్సంతో అక్కడ కూడా తుపానులను ఆపడం ఎలా అన్న చర్చ ముందుకు వచ్చింది. దాంతో మీడియాలో చాలా మంది చాలా రకాల పరిష్కారాలు చెబుతున్నారు. అయితే చాలా కాలం క్రితం నుండే తుపానులను ముఖ్యంగా హరికేన్ వంటి పెనుతుపానులను ఆపేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేశారు. 1960,70 దశకాల్లో ఈ దిశలో జరిగిన ప్రయత్నాలకు కొంతకాలం బ్రేకులు పడ్డాయి, మళ్లీ ఇప్పుడు ఈ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అప్పుడు బ్రేకు పడడానికి కారణం ఏమంటే తుపానులు ఆపడానికి నాడు శాస్త్రవేత్తలు తయారుచేసిన చాలా నమూనాలను అమలులో పెట్టాలంటే చాలా ఖర్చవుతుందని భయపడ్డారు. దాంతో పరిశోధనలు ఎక్కడివక్కడ నిలిపేశారు. కానీ ఇటీవల హరికేన్ కత్రినా వల్ల వచ్చిన నష్టం చూశాక ఇంత నష్టాన్ని నివారించాలంటే ఖర్చు భరించాల్సిందే అన్న నిర్ధారణకు వస్తున్నారు. హరికేన్ కత్రినా వల్ల ఒక్క అమెరికాకే 20,000 కోట్ల డాలర్లు (9 లక్షల కోట్ల రూపాయలు) నష్టం జరిగింది. రానున్న కాలంలో వాతావరణ కాలుష్యం పెరిగి గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వల్ల మరింత తీవ్రమైన హరికేన్లు రానున్నాయని వాతావరణ పండితులు చెబుతున్నారు. అందువల్ల తుపానులను అడ్డుకునేందుకు అలా వీలుకాకపోతే కనీసం వాటిని బలహీనపరిచేందుకు ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా అమెరికాలో ప్రయత్నాలు ముమ్మరమైనాయి.

అమెరికాలో ప్రఖ్యాత హరికేన్ నిపుణుడు హగ్ విల్లోబీ హరికేన్లను నిలువరించడానికి ఒక ఉపాయం చెప్పాడు. లక్ష టన్నుల చమురుతో ఉన్న కొన్ని నౌకలను హరికేన్ ప్రయాణిస్తున్న మార్గంలోకి తీసుకుపోయి అక్కడ సముద్ర ఉపరితలం మీద చమురును ఒలకబోయాలన్నది ఆయన చెప్పిన ఉపాయం. అలా ఒలికిపోయిన చమురు నీటిమీద ఒక పొరలాగా ఏర్పడుతుంది. మామూలుగా తుపాను కేంద్రం వద్ద సుడులు తిరిగే గాలిలో తేమ అధికంగా గల మేఘమాలలు ఉంటాయి. సముద్ర ఉపరితలం నుండి వచ్చే తేమను ఈ గాలి మరింతగా పీల్చుకుని తీవ్రమైన సుడిగుండంగా మారుతుంది. నీటి ఉపరితలం మీద కొన్ని చదరపు కిలోమీటర్ల పర్యంతం చమురు తెట్టు ఏర్పడ్డం వల్ల సుడిగుండంలోకి సముద్ర ఉపరితలం మీదనుండి నీటి ఆవిరివెళ్లడం ఆగిపోతుంది. దాంతో సుడిగుండం వేగం తగ్గి చివరికి బలహీన పడిపోతుంది. విల్లోబీ చెప్పిన ప్రయోగం ఎక్కడా చేయకముందే ఆయన నమూనాపై అనుమానాలు కూడా వచ్చాయి. సముద్ర మట్టం మీద మామూలు సమయాల్లో చమురు తెట్టు నిలుస్తుంది. కాని తుపానుల సమయంలో సముద్రం అల్లకల్లోలం అవుతుంది. అప్పుడు ఏ చమురు తెట్టూ నిలవదు, అంతా చెల్లాచెదురై పోతుంది అని మరో వాతావరణ శాస్త్రవేత్త కెర్రీ ఇమాన్యుయేల్ చెప్పాడు. ఇమాన్యుయేల్ చెప్పింది నిజమేగాని తుపానులో చమురు తెట్టు కొట్టుకుపోయినా చమురు చిన్న చిన్న బిందువులుగా ఉపరితలం మీద ఉంటాయి గనుక వాటి ప్రభావంవల్ల తుపాను బలహీన పడుతుంది అంటాడు విల్లోబీ. ఇద్దరూ గొప్ప శాస్త్రవేత్తలే. విల్లోబీ, మియామీలోని అంతర్జాతీయ హరికేన్ పరిశోధనా కేంద్రం మాజీ డైరెక్టర్ కాగా ఇమాన్యుయేల్, మెసాసుచెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వాతావరణ విభాగం శాస్త్రవేత్త. ఇద్దరిలో ఎవరు కరెక్టు అనేది ప్రయోగం జరిగితేగాని తెలియదు.

అయితే తుపానులు ఆపేందుకు మరో నమూనా కూడా ముందుకొచ్చింది. ఈసారి దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించి చూశారు కూడా. అదేమంటే కొన్ని విమానాల్లో నీటిని పీల్చే గుణం ఉన్న పొడిని తీసుకుపోయి తుపాను కేంద్రాల్లో చల్లడమే. ఈ పొడి తుపాను కేంద్రంలోని తేమను పీల్చేస్తుంది. దాంతో తుపాను బలహీనపడిపోతుంది. అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన డిన్-ఓ-మాట్ అనే కంపెనీ కార్లనుండి ఒలికిపోయే చమురు వంటి పదార్థాలను పీల్చుకునే మ్యాట్‌లు తయారుచేస్తుంది. ఈ కంపెనీ ఇంజినీర్లు డిన్-ఓ-జెల్ అనే పేరుతో నీటిని పీల్చే జెల్లీ వంటి పదార్థం తయారుచేశారు. 8000 పౌండ్ల జెల్లీని ఫ్లోరిడా సమీపంలో ఏర్పడిన ఒక చిన్నపాటి తుపాను కేంద్రంలో విమానాల ద్వారా వెదజల్లారు. అంతే నిమిషాల్లో తుపాను చెదిరిపోయి కనుమరుగైపోయింది. ఈ కంపెనీ అధిపతి, సిఇఓ పీటర్ కార్డాని ఆధ్వర్యంలో జరిగిన ప్రయోగం ఫలితాలను విశ్లేషిస్తున్నారు. దీన్ని మరింత ముందుకు తీసుకుపోయి వాణిజ్య స్థాయిలో తుపానులను చెదరగొట్టే జెల్లీ పదార్థాన్ని ఉత్పత్తి చేసి కోట్లు గడించవచ్చునని కంపెనీ అధిపతి కలలు కంటున్నారు. అయితే పీటర్ కార్డాని కలలు కల్లలవుతాయంటున్నాడు వాతావరణ నిపుణుడు క్రిస్ లాండ్స్‌స్లే. ఎందుకంటే చిన్న చిన్న తుపానుల్లో ప్రయోగాలు చేయడం వేరు పెను తుపానుల్లో ప్రయోగాలు వేరూననేది ఆయన వాదన. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తి అవుతున్న విద్యుత్తుకు 200 రెట్లు విద్యుత్తే ఎంత పనిని నిర్వహిస్తుందో ఒక పెనుతుపాను కేంద్రంలో అంతటి పని జరుగుతుందని ఆయన పేర్కొంటూ అటువంటి పెను తుపానును ఆపడం ఇటువంటి చిన్న చిన్న చిట్కాలతో సాధ్యం కాదని ఆయన చెబుతున్నారు.

ఈలోగా మేరీలాండ్‌కు చెందిన డాక్టర్ విన్ వింగర్ అనే ఆయన నేను హరికేన్లు ఆపడానికి ఒక యంత్రాన్ని రూపొందించానని దాని పేరు "హరికేన్ స్టాపర్" (హరికేన్ నిరోధిని) అని ప్రకటించాడు. తను రూపొందించిన యంత్రాన్ని తయారుచేసి పనిలో పెట్టాలంటే 4 కోట్ల డాలర్లు (180 కోట్ల రూపాయలు) అవుతుందని చెబుతున్నాడు. ఈ యంత్రాన్ని సముద్రగర్భంలో పెడితే అది కిందనున్న చల్లటి నీటిని సముద్రం పైకి పంపుతుంది. దానివల్ల సముద్రమట్టం మీది నీటి వేడి తగ్గుతుంది. సముద్ర మట్టంమీది వేడినీరు తుపానులు ఏర్పడి, ఉధృతమవడానికి కారణం కనుక తన యంత్రం ఆ విధంగా నీటిని చల్లార్చి తుపానుల ఉధృతిని తగ్గిస్తుందని ఆయన చెబుతున్నాడు. ఎవరికన్నా యంత్రం కావాలంటే డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు. విన్‌వెంగెర్.కామ్ అనే వెబ్‌సైటులో సంప్రదించాలని కూడా ఆయన చెబుతున్నాడు.

ఏదేమైనా వినాశనకరమైన పెను తుపానుల పీడ విరగడవ్వాలనేది మానవుని చిరకాల వాంఛ. ఈ వాంఛ నెరవేరాలంటే ఇంకా కొంతకాలం గడవాలి. ఇంకా అనేక పరిశోధనలు జరగాలి.

కొత్త పుస్తకాలు

తొలిమలుపే కాదు తొలివలపు కూడా



ప్రముఖ సీనియర్ రచయిత కాలమిస్టు వీరాజీ నలభై ఐదేళ్ళ క్రింద రాసిన నవల తొలిమలుపు. అప్పుడే ఈ నవలను విశాలాంధ్ర వారు ప్రచురించారు. పలు పునర్ముద్రణలు పొందిన ఈ నవలను ప్రస్తుతం విశాలాంధ్ర వారే మరోసారి ప్రచురించారు. ప్రస్తుత వేగవంతమైన హైటెక్ కాలంలో కూడా మళ్ళీ ఒక నవలను పునర్ముద్రించారు అంటే అందులో ఉన్న ప్రత్యేకతను గుర్తించాల్సిందే. కల్పనా సాహిత్యంలో సుదీర్ఘంగా సాగిపోయే నవలలకు ఈనాటి స్పీడ్‌యుగంలో చదువరులు తగ్గినప్పటికీ కొన్ని నవలలు వాటికున్న విశిష్ట లక్షణాల వల్ల పాఠకుల అభిమానానికి నోచుకుంటాయి. అందుకే గడిచిన కాలాన్ని అద్దంలా పట్టించే పాతనవలలకు ఎప్పుడూ గిరాకీ ఉంటుంది.

తొలిమలుపు నవల శైలి మనస్సుకు హత్తుకుంటుంది. ఈ నవలలోని ఆకర్షణీయమైన అంశం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థుల జీవితాలు, ఆనాటి యువకుల తొలివలపు పులకరింతలు. విజయవాడ ప్రాంతానికి చెందిన మధ్యతరగతి కుటుంబం నుండి కాలేజీ చదువు పూర్తిచేసుకుని విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలోకి ప్రవేశిస్తాడు-నవలా నాయకుడు శేఖరం. నవల మొత్తం విశ్వవిద్యాలయ నేపథ్యంతో సాగుతుంది. కొత్తకొత్తగా విశ్వవిద్యాయంలోకి అడుగుపెట్టిన శేఖరం మెల్లమెల్లగా స్నేహితుల సాన్నిహిత్యం సంపాదించుకుని తను వచ్చిన ఉద్దేశ్యాన్ని మరిచి చదువును నిర్లక్ష్యం చేస్తాడు. తన కులం కాని ధనవంతుల అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోలేని నిస్సహాయునిగా మిగిలిపోతాడు. చివరికి డిగ్రీ థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణుడై గట్టెక్కాననిపించుకుంటాడు.

ఉమాబాలతో శేఖరం ప్రేమ సంగతులను రచయిత చాలా ఆసక్తికరంగా చిత్రించారు. వేరు వేరు కులాలకు చెందిన వారిద్దరి మధ్య ప్రేమ చిగురించడం, కులాల ప్రస్తావన వచ్చినప్పుడు శేఖరం దిగులు పడడం చాలా వాస్తవికంగా ఉంది. యువకుల్లో తొలినాటి యవ్వనంలో కలిగే ప్రేమ భావాలను, ఆ భావాలలోని పరిణితి చెందని తనాన్ని రచయిత చిత్రించిన తీరు వాస్తవానికి చాలా దగ్గరగా ఉంది. ఓ పక్క మధ్యతరగతి జీవిత బరువైన నేపథ్యం మరోపక్క కాలేజీలో నవయవ్వన ఉత్సాహం నవలలోని హీరో శేఖర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

విశాఖపట్నంలో ఆశ్రయం ఇచ్చిన చిన్నాన్న కూతురు లలిత పెళ్ళి విషయంలో వచ్చిన మనస్పర్థలతో అక్కడి నుండి మకాం మార్చి వేలు విడిచిన మేనత్త ఇంట్లో శేఖరం అద్దెకు ఉండటం. మేనత్త కూతురు రాధికను శేఖరం అపార్థం చేసుకోవడం నవలలో మరో పార్శ్వం. ఆ రోజులలోనే రచయిత రాధిక చేత స్త్రీ ప్రేమకు సంబంధించి పరిణితి చెందిన మాటలు అన్పించడం రచయిత లోతైన అవగాహనను తెలియజేస్తుంది. రాధికను అపార్థం చేసుకున్న శేఖరం ఒకరోజు వ్యామోహంతో ఆమెను ముద్దు పెట్టుకుంటాడు. రాధిక తిరస్కారంగా వెళ్ళిపోతుంది. పశ్చాత్తాపంతో శేఖరం ఆ మరుసటి రోజు రాధికకు క్షమాపణ చెప్పినప్పుడు, రాధిక " నీ తప్పులేదు బావా, నీ సైన్సు గాని లెక్కలు గాని నీకు స్నేహం గురించి, ప్రేమ గురించీ యేమీ చెప్పవుగా... యూనివర్శిటీ విద్యలో యివేమీ నేర్పలేదుగదా మరి... నేనే కొంత చనువు తగ్గించి వుండవల్సింది..." అని అంటుంది.

తన పట్ల రాధిక కనబరిచిన ఆపేక్షను ప్రశ్నిస్తాడు శేఖరం దానికి సమాధానంగా రాధిక " స్నేహం చెయ్యాలని ఆడపిల్లలకి వుండకూడదనీ... అది కేవలం పురుషుల సొత్తనీ... ఆడవాళ్ళ ప్రేమకి ఒకటే అర్థమనీ నీ వుద్దేశ్యమా?... అయితే నువ్వు పొరబడ్డావు బావా" అంటుంది.

నవలలో నలభై యేళ్ళ నాటి పరిస్థితులు అడుగడుగునా కనబడతాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుల కోసం విశాఖపట్నం వెళ్ళడం అంత మందిని చూసి దేశవ్యాప్తంగా ఇంకెంత మంది విద్యార్థుల్లో అని శేఖరం భావించడం కొత్తగా ఆనాడు మధ్య తరగతి పెద్ద యెత్తున చదువులకు ఎగబాకడం తెలియజేస్తుంది. అయితే యూనివర్శిటీలో ఎక్కడా విద్యార్థి రాజకీయాలు పెద్దగా రచయిత చిత్రీకరించరు . ఏదో ఒకసారి విద్యార్థి నాయకుడు గిరి ఎన్నికలలో నిలబడటం, అతని గెలుపు కు ప్రచారానికి శేఖరం వెళ్ళడం ప్రస్తావన ఉంటుంది తప్ప అంతకు మించి ఎక్కడా ఉండదు.

శేఖరం కుటుంబం మధ్యతరగతి లక్షణాలను రచయిత చిత్రీకరించిన తీరు వాస్తవికతకు అద్దం పట్టింది.

ఆనాటి మధ్య తరగతి యువకుల మనోభావాలను, జీవన స్థితిగతులనూ ఈ నవల చాలా వరకూ వాస్తవికంగా వివరిస్తుంది. అప్పటి సమాజాన్ని రేఖామాత్రంగా అర్థంచేసుకోవడానికి తొలమలుపు నవల ఉపకరిస్తుంది. ఇక యూనివర్శిటీలో సాగే తొలివలపుల గురించి నవల చదవాలి తప్ప ఎంత చెప్పినా తక్కువే.

- వీరప్రసాద్

తొలిమలుపు నవల

రచయిత: వీరాజీ, పేజీలు: 128, వెల: రూ. 50/-

ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలలో

ప్రణయ తరంగాలు

కవితా సంకలనం

కాళహస్తి వెంకట శేషగిరిరావు

వెల: 20/-, పేజీలు: 39

ప్రతులకు :

కె. మేఘన

17-1-522, రాజక్కస్ట్రీట్

నెల్లూరు - 524 001.

సంతకాలు

(కవితా సంకలనం)

వెల: 30/-.

పేజీలు : 74

ప్రతులకు :

విశాలాంధ్ర,

ప్రజాశక్తి బుక్‌హౌస్‌లలో...



మొక్కజొన్న పకోడీలు

కావలసిన పదార్థాలు

మొక్కజొన్నపిండి - రెండు కప్పులు
ఉల్లి తరుగు - ఒక కప్పు
పచ్చిమిర్చి తరుగు - పావుకప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్ - ఒక స్పూన్
కొత్తిమీర తరుగు - అరకప్పు
కరివేపాకు - సన్నగా కట్ చేసినది కొద్దిగా
జీలకర్ర - అరస్పూన్
పసుపు - చిటికెడు
ఉప్పు - తగినంత
నూనె - సరిపడినంత

తయారుచేసే పద్ధతి

మొదట ఒక గెన్నెలోకి మొక్కజొన్న పిండి తీసుకొని అందులో నూనె తప్ప తక్కినవన్నీ వేసి వేడినీళ్ళతో కలుపుకోవాలి. ఇలా అయితే గుల్లగా వస్తాయి. నూనె కాగాక ఇందాకటి పిండి ముద్దను పకోడీల్లా వేసి ఎర్రగా వేయించి తీయాలి. ఇవి కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

రుచి

రాగివుండలు

కావలసిన పదార్థాలు

రాగులు - రెండు కప్పులు
బెల్లం తరుగు - నాలుగు కప్పులు
యాలకుల పొడి - ఒక స్పూన్
నెయ్యి - అరకప్పు

తయారుచేసే పద్ధతి

ముందుగా రాగులను శుభ్రం చేసుకుని నీళ్ళలో పోసి ఒక రోజంతా నానబెట్టుకోవాలి. తరువాత నీటిని తీసివేసి ఓ బట్టలో పోసి మూటగట్టి పైన బరువు పెట్టి రెండురోజులపాటు ఉంచినట్లయితే వాటినుండి మొలకలు వస్తాయి. అప్పుడు వాటిని ఆరబెట్టి బాండీలో దోరగా వేయించుకోవాలి. చల్లారిన తరువాత గ్రైండ్ చేసుకోవాలి. బెల్లం తరుగును ఓ గిన్నెలో వేసి కొద్దిగా నీరుపోసి పాకం పట్టుకోవాలి. ఇందులో రాగులపిండి వేసి దించి చల్లారాక ఉండలు కట్టుకోవాలి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచిది.

- జ్యోతి

సాహసం



యాసలపు సూర్యారావు

పెద్దాపురం రాజు ఆనందభూపతి. అతని నిర్లక్ష్యం, వ్యసనాల కారణంగా ఆ రాజ్యం కరువు కాటకాలకు నిలయంగా మారింది. తమ గోడు పట్టించుకోని రాజు పాలనపై ప్రజలు విసుగు చెందారు.

కానీ రాజుకు పొగడ్తలంటే చాలా ఇష్టం. తనను, తన పాలనను అభినందించిన వారికి ఇంతో అంతో బహుమతి ఇచ్చి పంపేవాడు. అందుచేత ఎప్పుడూ ఆనందభూపతి పాలన మహాఅద్భుతంగా వుందని, తన పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో తులతూగుతున్నా[illegible] మహామంత్రి మొదలు వేగుల వరకూ పొగుడుతుండేవారు. సామాన్య ప్రజలు [illegible]తం ఇలాగే ముఖస్తుతి చేసేవారు. ఇదంతా నిజమనుకున్న రాజు అహంకారంతో [illegible]ర్రవీగేవాడు. ప్రజల్ని మరచి నిత్యం అంతఃపురంలో భోగలాలసుడై కన్నుమిన్ను గానక తాగుతుండేవాడు. దీంతో పరిపాలన భ్రష్టు పట్టిపోయింది. ప్రజలు, రైతులు, కూలీలు 'అన్నమో రామచంద్రా' అని అలమటించసాగారు. ఆకలి చావులు చస్తున్నారు. అ[illegible]ా గొంతెత్తి అరవటానికిగానీ, ఏడ్వటానికిగానీ అక్కడ స్వేచ్ఛ లేదు. అంతా మూగ వేదనలతో చావుబతుకుల మధ్య రోజులీడుస్తున్నారు.

చూస్తుండగానే ఆనందభూపతి సింహాసనంపై కూర్చుని 30సంవత్సరాలు పూర్తయ్యాయి. తాను విజయవంతంగా, నిరాటంకంగా పాలించినందుకు రాజ్యంలోని ప్రజలందరూ విజయోత్సవాలు జరుపుకుంటే బాగుంటుందనిపించింది రాజుకు. పైగా తన పాలనా విశేషాలను గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఆ వివరాలను ప్రజలంతా నిర్భయంగా దర్బారుకు వచ్చి తెలియచేయాలని దండోరా వేయించాడు. రాజ్యం నలుమూలల నుండి ప్రజలు రాజధానికి చేరుకున్నారు.

దర్బారులో రాజుగారితోపాటు మహామంత్రి, ఆస్థాన పండితులు తదితరులంతా కొలువుదీరారు. సభలో చర్చలు ప్రారంభమైన దగ్గర్నుండి ప్రజలు వరుసకట్టి రాజు మీద పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. తామంతా సుఖసంతోషాలతో తులతూగుతున్నామని, శాంతి సౌఖ్యాలతో అలరారుతున్నామని రాజుగారు సాక్షాత్తు దేవుడని, దానకర్ణుడని ప్రతీ ఒక్కరూ భట్రాజు పొగడ్తలు పొగిడారు. అవన్నీ విన్న రాజు ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

ఇంతలో జనంలో నుంచి వచ్చిన ఒక వ్యక్తి "మహారాజా! నేను మాట్లాడతాను. అందుకు తమరు దయతో అనుమతి ఇవ్వవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు. 'దానికేం! నిస్సంకోచంగా మాట్లాడు' అన్నాడు రాజుగారు. "మహాప్రభూ! మీరు పాలించిన ముప్పై ఏళ్ళు ప్రజలు నరకం అనుభవించారని నేనంటే మీరు నా శిరస్సును కోటగుమ్మానికి వేలాడతీయిస్తారని నాకు తెలుసు. అయినా నా ఒక్కడి శిరస్సు పోయినా నేనేం బాధపడను. మీ రాజ్యంలో అరాచకాలు, ఆకలి చావులతో నిత్యం చచ్చేకంటే ఒక్కసారిగా చావటం మేలని నేను ఆ నిర్ణయం తీసుకున్నాను" అన్నాడా పౌరుడు.

దానికి రాజుగారికి చెప్పలేనంత ఆగ్రహం కలిగింది. "అంతేనా! ఇంకా ఏమైనా చెప్పుకునేదేమైనా వుందా?" అన్నాడు గంభీరంగా. "ఇంకా వుంది ప్రభూ... నా ముందు మిమ్ములను పొగిడిన వారందరూ మీరంటే భయపడి మిమ్మల్ని పొగుడుతున్నారు. నిజానికి వారు చెప్తున్నదంతా అబద్ధం" అన్నాడు వినయంగా. పౌరుడు చెప్పిన మాటలతో ప్రజలందరిలో ఒక పక్క భయం, మరో పక్క నిజం చెప్పాలనే ధైర్యం కూడా కలిగాయి. 'ఇంకా ఏం చెపుతావు?' అన్నాడు రాజు. తనకు ఉరిశిక్ష ఖాయమైనట్లు నిర్ణయించుకుని 'ఇక చెప్పేదేమీలేదు మహా ప్రభూ" అన్నాడు. ఉగ్రుడైన రాజు లేచి నిలబడి, "నిజం చెప్పండి. వాడు చెప్పింది నిజమేనా! లేక అబద్ధమా?" అని గర్జించాడు.

అంతే ప్రజలంతా ముక్తకంఠంతో "అతను చెప్పింది ముమ్మాటికీ నిజం ప్రభూ. మీరు మాకు ఏ శిక్ష విధించినా సమ్మతమే. అతను మా కళ్ళు తెరిపించాడు. మేమంతా పిరికివాళ్లం. ప్రాణభయంతో మీకు తందాన తాన అన్నాం. అతను నిరుపేద. అతనికున్నపాటి ధైర్యం కూడా మాకు లేదు. అందుకు మేము సిగ్గుపడుతున్నాం" అన్నారు ప్రజలు. ప్రజల నుంచి నిజాలు విన్న తర్వాత రాజుకి తలకెక్కిన తరతరాల అధికార దాహం, నిర్లక్ష్యం దిగిపోయాయి. వెంటనే విజయోత్సవాలను రద్దుచేశాడు. తన కళ్లు తెరిపించిన యువకుణ్ణి ఆంతరంగిక సలహాదారుగా నియమించుకున్నాడు. ప్రజల శ్రేయస్సే పరమావధిగా జీవించాడు.

బాలల కథ